ప్రజాశక్తి

గురువారం 15 డిసెంబర్ 2022 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

తుపాన్‌కు దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

67,265 ఎకరాల్లో నష్టం

- 'మాండూస్' కారణంగా దెబ్బతిన్న పంట..
- వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాండూస్ తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలతో జిల్లాలో 67,265 ఎకరాలలో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. మాండూస్ తుఫాన్ కారణంగా జిల్లాలో రైతాంగం సాగు చేసిన మినుములు, పెసలు, అలసందలు, పత్తి, వరి పంటలకు తీవ్ర నష్టం జరిగింది. మినుములు 44,441 ఎకరాలు, పెసలు 32 ఎకరాలు, అలసందలు 17,805 ఎకరాలు, పత్తి 553 ఎకరాలు, వరి 4244 ఎకరాలు, వేరుశనగ 70 ఎకరాలలో పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

పొగాకు రైతులనూ ఆదుకుంటాం..

టంగుటూరు: మాండూస్ తుఫాను వల్ల దెబ్బతిన్న పంటల ఎన్యూమరేషన్ (వివరాల నమోదు) ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. ఇతర పంటల రైతులతోపాటుగా పొగాకు సాగుదారులను కూడా ఆదుకుంటామని చెప్పారు. బుధవారం ఆయన ఒంగోలు, టంగుటూరు మండలాలలో పర్యటించారు. ఒంగోలు మండలం చెరువుకొమ్ముపాలెం, యరజర్ల గ్రామాలు, టంగుటూరు మండలం కందులూరు, కట్టుబడి గ్రామాలలో దెబ్బతిన్న శనగ, పొగాకు, మినుము, మిరప ▶ 2లో

సర్వం కోల్పోయాం..

- ఏ పంటా చేతికి వచ్చేలా లేదు..
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఎదుట రైతుల ఆవేదన
- నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం డిమాండ్

ఉప్పుగుండూరులో మిర్చి పంటను పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నాయకులు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

'ఏ పంట చూసినా చేతికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. లక్షలాది రూపాయలు పెట్టుబడికి ఖర్చు చేశాం.. ఒక్క రూపాయి కూడా తిరిగివచ్చే పరిస్థితి లేదు. సర్వం కోల్పోయాం' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఎదుట రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరు, చదలవాడ, నాగులుప్పలపాడు తదితర గ్రామాల్లో తుపాన్‌కు దెబ్బతిన్న శనగ, మిర్చి, పొగాకు, వరి తదితర పంటలను సిపిఎం బృందం పరిశీలించింది.

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ దెబ్బతిన్న పంటలను కాపాడుకోవడానికి పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. నాగన్న వాగు డ్రైనేజీ పూడికతో నిండుకొని ఉండి వరద నీరు పోయే మార్గం లేదని, దాని పక్కనే ఉన్న రెండు వేల ఎకరాలు మాగాణి భూములు నీటమునిగి నష్టపోతున్నాయన్నారు. ఆ పూడిక తీయించి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దీని పరిధి బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉందని, రైతులంతా ఐక్యంగా కలిసి వస్తే రెండు జిల్లాల కలెక్టర్లతో సంప్రదించి పరిష్కార మార్గం అడుగుదామన్నారు. లేకుంటే ఆందోళనకు అందరూ ఐక్యంగా నిలబడాలన్నారు. మాండూస్ తుపాన్‌కు రైతులు కోలుకోలేని పరిస్థితి నెలకొందని, తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయాధికారి వెంకట్రావును కలిసి వివరాలు అడిగారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం నష్టపరిహారం జాబితాకు సంబంధించిన జీవో జారీ చేసిందన్నారు. ఆ జాబితా పరిశీలిస్తే ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం పొగాకుకు అయితే మూటనారు కూడా రాదన్నారు. శనగ పంటకు నష్టపరిహారం చూస్తే ఎకరా విత్తనాల ఖర్చు కూడా రాదని పేర్కొన్నారు. మిగిలిన పంటలకు కూడా ఏ మాత్రం రైతులకు మేలు చేసే విధంగా లేవన్నారు. ఈ నేపథ్యంలో రైతులు వ్యవసాయం చేసే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం పునరాలోచించి నష్టపరిహారం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో పాటుగా ఖరీఫ్ పంటలన్నింటికీ బీమా ▶ 2లో

పదవుంది..పవరేదీ.?

- మేయర్ మనోవేదన
- పరిపాలనలో తనదైన ముద్ర వేయలేకపోతున్న సుజాత
- బాధ్యతలు చేపట్టి.. రెండేళ్లు కావస్తున్నా సొంతంగా నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి
- దళిత మహిళ కావడంతో సహాయ నిరాకరణ చేస్తున్న ఉద్యోగులు..?

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఆమె ప్రభుత్వ టీచర్. వందలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన మహిళ. ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో ప్రభుత్వ ఉద్యో గాన్ని వదిలి రాజకీయాల్లో అడుగుపెట్టారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆశీ స్సులతో రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగి ఒంగోలు నగర మేయర్ అయ్యారు. ఎన్నో ఇబ్బందులను అధిగమించి.. ఆమె ఆ స్థానాన్ని అధిరోహించారు. నగర ప్రథమ మహిళ స్థానంలో కూర్చున్నారు. ఆ స్థానంలో కూర్చొని దాదాపు రెండేళ్లు కావస్తోంది. అత్యంత కీలక మైన పదవిలో కూర్చొని ఇంతకాలం అవుతున్నా ఆమె ఒంగోలు కార్పొరేషన్ పాలనపై పట్టు సాధించలేకపోయారు. పరిపాలనలో కనీసం ఒక్కటంటే ఒక్క మార్పు కూడా తీసుకురాలేకపోయారు. ఎందుకిలా జరుగుతుంది...? పట్ట భద్రురాలు అయిన ఆమె ఎందుకు పాలన మీద ఎందుకు పట్టు సాధించలేకపోయారు.? అంటే పేరుకే మేయర్ అయినా పరిపాలన పగ్గాలన్నీ పాలక పార్టీ కీలకనేతల చేతుల్లోనే ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత పరిపాలనా సంస్క రణల విషయంలో మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలో చూపిన చొరవ ప్రస్తుతం చూపడం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే పరిపాలన వ్యవహారాలను ఆమె పూర్తిగా పక్కన పెట్టారనే చర్చ జరుగుతోంది. ఇందుకు గల కారణాలను పరిశీలిస్తే.!

మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన కొన్నాళ్లకు కార్పొరేషన్‌లో అవినీతికి అడ్డాగా ఉన్న రెవెన్యూ సెక్షన్‌లో పలు మార్పులు చేయాలని సుజాత తలచారు. ఇందుకు గానూ ఈ పాటికే పనిచేస్తున్న కొంతమంది ఇన్‌ఛార్జి రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లను ఆ స్థానాల నుంచి తప్పించాలని నిర్ణయించారు. ఆమె నిర్ణయం పట్టాలెక్కక మునుపే బ్రేక్‌లు పడ్డాయి. అక్కడ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లుగా కొలువులు చేస్తున్న వారంతా ఎవరో ఒక అధికార పార్టీ నాయకునికి విధేయులుగా ఉన్నవారే.. చేసేదేమీ లేక ఆమె రెవెన్యూ సెక్షన్‌లో జోక్యం చేసుకోవడం మానేశారనే చర్చ జరుగుతోంది. టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లోనూ అవినీతి రాజ్యమేలుతోంది. ఇక్కడ సెక్షన్ హెడ్‌గా ఉన్న వ్యక్తి నగరంలో జరిగే అక్రమ కట్టడాలకు అండగా నిలుస్తున్నాడనే విమర్శలున్నాయి. కార్పొరేషన్ పాలకవర్గంలో ఓ కీలక నేత అండ చూసుకున్న ఆ సెక్షన్ హెడ్ ఎవరి మాట లెక్క చేయడం లేదనే చర్చ జరుగుతోంది.' పలుచోట్ల అక్రమ కట్టడాలు జరుగుతున్నాయి. వాటిని అరికట్టండి '..అని నేరుగా మేయర్ ఆదేశించినా టౌన్‌ప్లానింగ్ సెక్షన్ హెడ్ పట్టించుకోవడం లేదనే ప్రచారం జోరుగా జరుగుతోంది. ఇంజినీరింగ్ సెక్షన్‌లో జరిగే పలు నిర్మాణాల నాణ్యత విషయంలోనూ మేయర్ చేసిన సూచనలు ఆ సెక్షన్ ఉద్యోగులు లైట్ తీసుకుంటున్నారని సమాచారం. దీంతో తన మాట ఎవరూ లెక్క చేయడం లేదని నేరుగా మేయరే తనకు విధేయులుగా ఉన్నవారి వద్ద వాపోతున్నారని సమాచారం.

అధికార పార్టీ కార్పొరేటర్లు కూడా ఎవరూ మేయర్ మాట వినే పరిస్థితి లేదని ప్రచారం జరుగుతోంది. ఎవరికివారు ఏదైనా పని ఉంటే నేరుగా ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వద్దకు వెళ్లి కమిషనర్‌కు ఫోన్ చేయించుకొని ఆ పని చేయించుకుంటున్నారని, కనీసం ▶ 2లో

పర్చూరుకు 'ఆమంచి'.!

- ఇన్‌ఛార్జిగా వెళుతున్నా..
- అభిమానులతో మాజీ ఎమ్మెల్యే కృష్ణమోహన్

3లో

జిల్లాలో

పనిచేసే అధికారులే ఉండాలి

- శ్రద్ధలేని వారు ఇతర జిల్లాలకు వెళ్లిపోవచ్చు
- కలెక్టర్ కె.విజయకృష్ణన్

కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పనిచేసే అధికారులే జిల్లాలో ఉండాలని, శ్రద్ధ లేని వారు ఇతర జిల్లాలకు వెళ్లిపోవచ్చని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను సున్నితంగా మందలించారు. బాపట్ల జిల్లాలోని పట్టణ ప్రాంతాలలో గృహనిర్మాణాలు పురోగతి లేకపోవడంపై కలెక్టర్ ఆరా తీశారు. అధికారుల పనితీరు మార్చుకోవాలన్నారు. జగనన్న కాలనీలలోని గహనిర్మాణాల పురోగతిపై గహనిర్మాణ శాఖ, డి.ఆర్.డి.ఎ., మెప్మా అధికారులతో బుధవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. గహాల కోసం రుణం పొందిన వారంతా పక్కా గహాల నిర్మాణాలు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లబ్ధిదారుల నుంచి డబ్బులు తీసుకున్న బేల్దారి మేస్త్రీలు సక్రమంగా పనిచేస్తున్నారా? లేదా? అనే అంశాలపై పరిశీలన చేయాలన్నారు. గృహ నిర్మాణాలకు అవసరమైన కూలీలను సమకూర్చాలని కలెక్టర్ సూచించారు. పక్కాగహాల నిర్మాణానికి మంజూరు చేసిన రుణాలను వ్యక్తిగత అవసరాలకు వినియోగించడం మంచిపద్ధతి కాదన్నారు. వేమూరులో ఏర్పాటు చేయాల్సిన గృహ నిర్మాణ శాఖ డివిజనల్ ఇంజినీరు కార్యాలయాన్ని నేటికీ గుంటూరు జిల్లా తెనాలిలోనే కొనసాగించడంపై కలెక్టర్ మండిపడ్డారు. మూడు రోజుల్లో కార్యాలయాన్ని తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజూ పక్కా గృహాల నిర్మాణాలపై కలెక్టరేట్‌కు నివేదిక పంపాలని ఆదేశించారు. సమావేశంలో డి.ఆర్.డి.ఎ. పీడీ బి.అర్జునరావు, మెప్మా పి.డి. టి. రవికుమార్, డ్వామా పి.డి. వై శంకరనాయక్, గృహనిర్మాణ శాఖ ఇంజినీర్లు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

67,625 ఎకరాల్లో నష్టం

(మొదటిపేజీ తరువాయి)

పంటలను పరిశీలించారు. ఆయా నేలల స్వభావం, పంటలు సాగు చేసిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులతోనూ ప్రత్యక్షంగా మాట్లాడారు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తరపున అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. పొగాకు రైతులను ఆదుకొనే దిశగా పొగాకు బోర్డు అధికారులతో సమన్వయంతో పనిచేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ విషయంపై పొగాకు బోర్డు అధికారులతో గురువారం ప్రత్యేకంగా మాట్లాడతానని ఆయన ప్రకటించారు. రైతులెవరూ అధైర్యపడవద్దని కలెక్టర్ చెప్పారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్, డాట్ సెంటర్ శాస్త్రవేత్త వరప్రసాద్, ఒంగోలు నియోజకవర్గ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రమేష్ బాబు, కొండపి నియోజకవర్గ వై.సి.పి. ఇన్ఛార్జి వరికూటి ఆశోక్ బాబు, ఒంగోలు తహశీల్దారు పి. మురళి, టంగుటూరు తహశీల్దారు చిరంజీవి, టంగుటూరు మండల వ్యవసాయ అధికారి స్వర్ణలత, వైసిపి టంగుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు, కొండపి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి హరిబాబు, ఉద్యానశాఖ అధికారి తేజ ఉన్నారు.

వికలాంగులకు అండగా ఆర్‌డిటి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వికలాంగులకు ఆర్‌డిటి అండగా ఉంటుందని ఆర్‌డిటి ఏరియా టీమ్ లీడర్ గిరిజ అన్నారు. బుధవారం స్థానిక ఎన్‌జిఒ హోం ఆవరణంలో వికలాంగుల సమస్యలపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజ మాట్లాడుతూ వికలాంగుల సమస్యలను తెలుసుకునేందుకు ఆర్‌డిటి సంస్థ మండలాల వారీగా యాక్టివ్ లీడర్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వారి ద్వారా గ్రామాల్లో ఉన్న వికలాంగుల సమస్యలు నేరుగా తెలుసుకుంటామన్నారు. వికలాంగులకు అవసరమైన వీల్ చైర్స్, చేతి కర్రలు, త్రీ వీలర్స్ బండ్లుతో పాటు ఎవరికి ఎలాంటి అవసరాలు ఉంటాయో నేరుగా యాక్టివ్ లీడర్స్ తెలియజేస్తే వారికి సకాలంలో అందజేస్తామని తెలిపారు. అలాగే రానున్న కాలంలో ఆర్డిటి సంస్థ వికలాంగుల సమస్యలపై నిరంతరం కషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రఫిక్, పాల్గొన్నారు.

పదవుంది..పవరేదీ.?

(మొదటిపేజీ తరువాయి)

మేయర్‌ను సంప్రదించడానికి కూడా పలువురు సుముఖత చూపడం లేదని సమాచారం. ఒకరిద్దరు మహిళా కార్పొరేటర్ల భర్తలు తప్ప మేయర్ మాటను ఏ కార్పొరేటర్ కూడా లెక్కచేయడం లేదని తెలిసింది. నగరంలోని పలు చోట్ల ప్రయివేటు భూములకు టిడిఆర్ బాండ్ల కేటాయింపు విషయం గతంలో జరిగిన కౌన్సిల్ సమావేశాలలో అజెండాలో చేర్చారు. దాన్ని ఆమోదించే విషయంలోనూ అధికార పార్టీ కార్పొరేటర్లలో ఏకాభిప్రాయం లేదు. దీంతో కౌన్సిల్ అజెండాలో ఏ విషయాలు చేర్చాలన్నా మేయర్ పదేపదే సొంత పార్టీ సభ్యులతో చర్చోపచర్చలు చేయాల్సి వస్తుందని సమాచారం. మేయర్‌గా ఆమె నిర్వర్తించాల్సిన కర్తవ్యాలను సక్రమంగా నిర్వర్తించలేకపోవడానికి ఆమె దళిత మహిళ కావడమే కారణమనే చర్చ జోరుగా జరుగుతోంది. ఆమె దళిత మహిళ అయినందునే ఏ నిర్ణయం తీసుకున్నా దానికి మద్దతు పలికేవారు కరువవుతున్నారని తెలుస్తోంది. కమిషనర్‌తో పాటు సెక్షన్ హెడ్‌లుగా ఉన్నవారు ఎవరూ పాలన వ్యవహారాలలో ఆమెను సంప్రదించడం లేదని సమాచారం. ఇది చూసిన పలువురు దళిత ఉద్యోగులు గ్రూపుగా ఏర్పడి ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు. కార్పొరేషన్ చరిత్రలో తొలిసారిగా ఉద్యోగులు సామాజికవర్గాల వారీగా గ్రూపులు కట్టారని తెలిసింది. ఈ నేపథ్యంలో మేయర్ సుజాత కార్పొరేషన్ పరిపాలన వ్యవహారాలను పూర్తిగా పక్కనపెట్టారనే చర్చ జరుగుతోంది. ఊర్లో ఎమ్మెల్యే ఉంటే ఆయన వద్దకు వెళ్లి అటెండెన్స్ వేయించుకోవడం, ఆఫీసుకు వచ్చి కాసేపు కుర్చీలో కూర్చొని ఇంటికి వెళ్లడం నిత్యకృత్యంగా మార్చుకున్నారని ప్రచారం జరుగుతోంది. ఎంతో చరిత్ర కలిగిన ఒంగోలు కార్పొరేషన్ మేయర్ కుర్చీలో ఓ దళిత మహిళ కూర్చొని పాలన చేస్తుంటే ఆమెను ప్రోత్సహించాల్సిన వారు ఆ పని చేయకపోగా సహాయనిరాకరణ చేస్తూ ఆమెను మనోవేదనకు గురిచేస్తున్నారని పలువురు దళిత సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

ప్రజాశక్తి-వెలిగండ్ల

మరపుగుంట్ల గ్రామానికి చెందిన బత్తుల బాలయ్య, బోరిగర్ల చిన్నవెంగయ్య, బత్తుల చిన్నబాలయ్యలకు చెందిన గొర్రెలు రేస్ కుక్కల దాడిలో చనిపోయాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న జిల్లా గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం నాయకులు తోట తిరుపతయ్య, రాయల మాలకొండయ్య మరపుగుంట్లకు బుధవారం వెళ్లి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గొర్రెలకు మేత కోసం ఆదివారం అడవి ప్రాంతానికి వెళ్ళగా, అక్కడ ఉన్న రేస్ కుక్కలు గొర్రెలను అమానుషంగా పైనపడి గాయపరిచి చంపేశాయని తెలిపారు. ఒక్కొక్కరికి రూ.1.50లక్షల నష్టం వాటిల్లిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి గొర్రెలకు నష్టం కింద సహాయం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం నాయకులు ఖండే బాలకష్ణ పాల్గొన్నారు.

విద్యార్థుల బూట్ల కొలతలు అప్‌లోడ్ చేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

విద్యార్థుల బూట్ల కొలతలను అప్‌లోడ్ చేయాలని ఎంఇఒ పి ఆంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని నరసాయిపాలెం ఎంపిపి ఎస్‌సి పాఠశాలను తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లు, ఉపాధ్యాయుల పాఠ్య ప్రణాళికలు, టిఎల్ఎంలు పరిశీలించారు. ఎండిఎం రికార్డులు, మెనూ పట్ల ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగరాజు, విన్‌సెంట్, ఉపాధ్యాయులు సుబ్బయ్య, ప్రసన్న, సలిమునిసా తదితరులు పాల్గొన్నారు.

మిర్చి పంటను పరిశీలించిన ఉద్యాన శాఖ అధికారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఉద్యాన అధికారి ఆదిరెడ్డి తన సిబ్బందితో కలిసి బుధవారం పుల్లలచెరువు మండలంలోని కవలకుంట్ల, వెంకటరెడ్డిపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న మిర్చి, మినుము, తదితర పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. నష్టపోయిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల్లో నీళ్లు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కోఆప్షన్ సభ్యుడికి పరామర్శ

ప్రజాశక్తి-దరిశి

దరిశి నగర పంచాయితీ కోఆప్షన్ సభ్యుడు అనలమూరి చిన్నమస్తాన్‌వలికి ఇటీవల బైక్ ఢీ కొని కాలికి దెబ్బ తగలగా ఆయనను దరిశి మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు, టిడిపి నాయకులు పరామర్శించారు. పరామర్శించిన వారిలో నగర పంచాయితీ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య, మండల పార్టీ అధ్యక్షుడు చిట్టె వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, నాయకులు సంగా తిరుపతిరావు, గాలయ్య, దినకర్, శ్రీను, వలి, అశోక్, జాన్ సామ్యేల్ ఉన్నారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న నాయకులు

దెబ్బ తిన్న పంటల పరిశీలన

ప్రజాశక్తి-త్రిపురాంతం

మండలంలోని పంట నష్టపోయిన పొలాలను పరిశీలించిన రైతు సంఘం నాయకులు రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని మండల రైతు సంఘం నాయకులు గొట్టుముక్కల రాజారామయ్య డిమాండ్ చేశారు. అనంతరం సిపిఎం పార్టీ నాయకులు వైటి ఆంజనేయులు రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు నాయకులతో సమన్వయంతో కలుపుకుని నష్టపరిహారాన్ని త్వరితగతినఅంచనా వేసి నివేదికలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పిచ్చయ్య, మహిళా సంఘం నాయకురాలు ఆర్‌ఎం నాగమల్లేశ్వరి, రోడ్డ గంగమ్మ, యోవేలు, రైతులు పాల్గొన్నారు.

దరిశి :మాండూస్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలను శాస్త్రవేత్తలు పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. దరిశి మండలంలో పలు గ్రామాలలో దెబ్బతిన్న పంటలను శాస్త్రవేత్తలు ఎం. ఉష, ఎన్. వెంకటేశ్వరరెడ్డి, కాశీవిశ్వనాధ్‌లు రైతులకు సూచనలు ఇచ్చారు. కంది, శనగ, మినుము పంటలను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

సర్వం కోల్పోయాం..

(మొదటిపేజీ తరువాయి)

సౌకర్యం కల్పించి ఆదుకోవాలన్నారు. తిరిగి రైతులు వ్యవసాయం చేయాలంటే శనగ విత్తనాలు పూర్తి సబ్సిడీపై అందజేయాలన్నారు. ఎరువులు, పురుగుమందులు కూడా సబ్సిడీపై ఇవ్వాలన్నారు. అప్పుడే రైతులు వ్యవసాయం చేయగలుగుతారన్నారు. డ్రైనేజి సమస్యతో నష్టపోతున్న పొలాలను కాపాడే విధంగా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఎస్‌కె.మాబు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య, రైతు, కౌలురైతు సంఘాల జిల్లా సహాయ కార్యదర్శులు జె.జయంతిబాబు, టి.శ్రీకాంత్, రైతుసంఘం మండల కార్యదర్శి కాకాని సుబ్బారావు,పాల్గొన్నారు.

ఒరిజినల్ దస్తావేజులు పోయినది

చిలుమూరు, కొల్లూరు మండలం, డోర్ నెం:1-85ఎ కాపురస్తులు కొలసాని తులసీ విష్ణుప్రసాద్ గారి కుమారుడు కొలసాని శ్రీకాంత్ అను నేను ది॥ 05-12-2022న గుంటూరు జిల్లా, వడ్లమూడి గ్రామ పంచాయితీ ఏరియాలోని డోర్ నెం:262/1ఎ, 262/8, 262/9, 280/5 గల ప్లాట్ విస్తీర్ణం 330 చదరపు గజాల ఖాళీ మెరక నివేశ స్థలం ప్లాట్ నెం:345, 371 కి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు (నెం.3406/2012) ప్లాస్టిక్ కవరులో పెట్టుకొని కొల్లూరు గ్రామానికి విక్రయ నిమిత్తం బ్రోకర్లకు చూపించేందుకు మోటారు సైకిల్‌పై వెళుచుండగా మార్గ మధ్యములో పోయినవి. కావున ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది నెంబరుకు సంప్రదించగలరు
ఫోన్:8639352905.

NOTICE UNDR ORDER 9 RULE 9 OF C.P.C
కందుకూరు సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో
I.A.No. 1264 / 2019
O.S.No. 28 / 2012

వక్కల రమాదేవి – పిటిషనరు / వాది
వర్సెస్
కోటు శ్రీకృష్ణ హరనాథ్
మరియు వగైరాలు – రెస్పాండెంట్లు / ప్రతివాదులు
టూ,
1. **పాపని శంకరనారాయణ రావు (R3)**
తండ్రి **రాధకృష్ణయ్య,** కొప్పోలు గ్రామం, ఒంగోలు మండలం, ప్రకాశం జిల్లా.
2. **మంగళగిరి నరశింహారావు (R4)**
తండ్రి **లక్ష్మీ నరసయ్య,** రైలుపేట, ఒంగోలు పట్టణం, ఒంగోలు మండలం, ప్రకాశం జిల్లా.
3. **నున్నా శివరామకృష్ణ (R6)**
తండ్రి **సుబ్బారావు,** ధారావారి తోట, ఒంగోలు పట్టణం మరియు మండలం, ప్రకాశం జిల్లా.
అయ్యా,

పై దావా O.S.No. 28 / 2022 ను రెస్టోరు చేయమని, డిఫాల్ట్ డిస్‌మిసల్ ఆర్డరు రద్దుపరచమని కోరి పిటీషనరు, పై పిటీషన్ దాఖలు చేసినందుకు మీకు నోటీసు నిమిత్తం తేది: 21-12-2022 న వాయిదా వేయబడివున్నది. కాన పై తేదిన ఉదయం 10.30గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల పై పిటీషను మీ పరోక్షమునందు తీర్మానింతురు.

"కోర్టు వారి ఆదేశానుసారంగా"
సన్నెబోయిన శ్రీనివాసులు
షేక్ షంషుద్దీన్
న్యాయవాదులు, కందుకూరు

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఓ.యస్. 887/2022

బిట్వీన్:
కొప్పరాజు సాంబశివరావు ...వాది
ఎదిరి
తొండెపు శ్రావణి ...ప్రతివాది
టు,
తొండెపు శ్రావణి, D/o.లక్ష్మీ నారాయణ, W/o జాలాది అయ్యప్ప, Door No.13-9-54/41, Plot No.407, వైష్ణవి అవెన్యు, పొలిమేర రోడ్డు, మహిళా మండలి దగ్గర, చీరాల, ప్రకాశం డిస్ట్రిక్ట్.

వాది పై నెంబరు దావాలో మీకు కోర్టు ద్వారాను, రిజిష్టర్ పోస్ట్ ద్వారాను నోటీసులు పంపిననూ, మీరు తీసుకోనందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా దావా నోటీసు పంపవలసినదిగా ఆర్డరు వేస్తూ పై దావాను ది.26-12-2022 కు వాయిదా వేసినారు. ఆ తేదీన మీరు ఉదయం 10-30గంటలకు పై కోర్టులో స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొవలెను. లేనియెడల పై దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఈ ప్రకటన ద్వారా తెలియచేయడమైనది.
వాయిదా తేదీ:26-12-2022

పి.తరుణ్ కుమార్,
పి.వి.శ్రీమన్నారాయణ,
వాది తరపు అడ్వకేట్స్,
తెనాలి.

NOTICE UNDR SECTION 5 OF LIMITATION ACT
కందుకూరు సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో
I.A.No. 1265 / 2019
O.S.No. 28 / 2012

వక్కల రమాదేవి – పిటిషనరు / వాది
వర్సెస్
కోటు శ్రీకృష్ణ హరనాథ్
మరియు వగైరాలు – రెస్పాండెంట్లు / ప్రతివాదులు
టూ,
1. **పాపని శంకరనారాయణ రావు (R3)**
తండ్రి **రాధకృష్ణయ్య,** కొప్పోలు గ్రామం, ఒంగోలు మండలం, ప్రకాశం జిల్లా.
2. **మంగళగిరి నరశింహారావు (R4)**
తండ్రి **లక్ష్మీ నరసయ్య,** రైలుపేట, ఒంగోలు పట్టణం, ఒంగోలు మండలం, ప్రకాశం జిల్లా.
3. **నున్నా శివరామకృష్ణ (R6)**
తండ్రి **సుబ్బారావు,** ధారావారి తోట, ఒంగోలు పట్టణం మరియు మండలం, ప్రకాశం జిల్లా.
అయ్యా,

పై దావా O.S.No. 28 / 2022 ను డిస్‌మిస్ చేస్తూ పాస్ చేసిన డిఫాల్ట్ డిస్‌మిసల్ ఆర్డర్‌ను రద్దు పరచి పై దావాను రెస్టోరు చేయమని దాఖలు చేయవలసినపిటీషన్ I.A.No. 1264 / 2019 దాఖలు చేయుటలో కలిగిన 233 రోజుల ఆలస్యమును మన్నించమని కోరి పిటీషనరు పై పిటీషన్ దాఖలు చేసినందుకు మీకు నోటీసు నిమిత్తం తేది: 21-12-2022 న వాయిదా వేయబడివున్నది. కాన సదరు వాయిదారోజు ఉదయం 10.30గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల పై పిటీషను మీ పరోక్షమునందు తీర్మానింతురు.

"కోర్టు వారి ఆదేశానుసారంగా"
సన్నెబోయిన శ్రీనివాసులు
షేక్ షంషుద్దీన్
న్యాయవాదులు, కందుకూరు

మహారాజశ్రీ మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి. 38/2022
ఇన్
ఓ.ఎస్. 80/2020

ఉదారపు పద్మావతి .... డిహెచ్ఆర్/ వాది
వర్సెస్
కూరేటి నాగమ్మ .... జెడిఆర్/ ప్రతివాది
టు,
కూరేటి నాగమ్మ, భర్త: వెంకటేశ్వర్లు
హిందూ, గృహిణి,
నివాసం: పొట్లపాడు గ్రామం
కురిచేడు మండలం, ప్రకాశం జిల్లా.

మీ పైన మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో పై నెంబరు ఇ.పి.ని డిహెచ్ఆర్ దాఖలు చేసి ఉన్నారు. ఈ ఇ.పి.నందు కోర్టు ద్వారా ఆర్డర్ 21 రూల్ 34 సిపిసి నోటీసులు పంపిననూ తీసుకొనకుండా కాలాయాపన చేయుచున్నారు. కావున కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా సమనులు జారీ చేయమని ఆర్డర్ వేసియున్నారు. కావున పై నెంబరు కేసు 29-12-2022 వ తేదీన ఉన్నది. కావున మీకు ఎలాంటి అభ్యంతరములు ఉన్నయెడల ఆ రోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా కానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు విమర్శచేసి తీర్మానించబడునని ఖండితముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వులతో)
వాయిదా తేదీ: 29-12-2022
మార్కాపురం **ఆర్‌వి.నాగేశ్వరశాస్త్రి,**
అడ్వకేట్, మార్కాపురం

పర్చూరుకు 'ఆమంచి'..!

- ఇన్‌ఛార్జిగా వెళుతున్నా..
- అభిమానులతో మాజీ ఎమ్మెల్యే కృష్ణమోహన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వైసిపి అధినేత జగన్ సూచన మేరకు తాను వైసిపి పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వెళుతున్నానని చీరాల మాజీ శాసనసభ్యులు ఆమంచి కృష్ణమోహన్ చెప్పారు. బుధవారం పందిళ్లపల్లిలోని తన నివాసంలో అనుచరులతో అంతర్గత సమావేశం నిర్వహించిన ఆమంచి తాను పర్చూరు వెళ్లడానికి దారితీసిన అంశాలపై తన అనుచరులతో గ్రూపులుగా ముచ్చటించారు. గడచిన ఏడాదిన్నర కాలంగా ఆమంచి రాజకీయ పయనం విషయమై రకరకాల ఊహాగానాలు ప్రచారంలోకొచ్చాయి. ఆమంచిని పర్చూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జిగా వెళ్లాలని పార్టీ అధినేత జగన్ చెప్పారని, కానీ అలా వెళ్ళడం ఆమంచికి ఇష్టం లేదని ఆమంచి అభిమానులు చెబుతూ వచ్చారు. కానీ పర్చూరు నుంచి రానున్న ఎన్నికల్లో కాపు అభ్యర్థిని రంగంలో నిలపాలన్న జగన్ ఆలోచన కారణంగా పర్చూరు అంశం పార్టీ అధిష్టానం వద్ద నలుగుతూనే ఉంది. మొన్నటివరకు బాపట్ల జిల్లా పార్టీ వ్యవహారాలను చూస్తూ వచ్చిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఒకరిద్దరు కాపు వర్గానికి చెందిన వారిని జగన్ వద్దకు తీసుకెళ్ళారు. కానీ జగన్ అంగీకరించకపోవడంతో అది కార్యరూపం దాల్చలేదు. అప్పట్లో తాను పర్చూరు వెళ్లేందుకు ఆమంచి పెట్టిన షరతుల్లో బాలినేని జోక్యం పర్చూరు రాజకీయాల్లో ఉండకూడదన్నది. ఇప్పుడు బాలినేని వేరే జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్‌గా వెళ్లినందున ఆమంచికి ఆ సమస్య లేనట్లే..

కాగా న్యాయమూర్తులపై అనుచిత వాఖ్యల కేసులో ఆమంచి పేరు కూడా ఉంది. సిబిఐ అధికారులు విచారణకు పిలిచారు. కానీ విచారణకు ఆమంచి హాజరైతే అనంతరం అరెస్టు చేస్తారని తెలియడంతో కొంతకాలంగా అజ్ఞాతంలో ఉన్నారు. ఎక్కడా ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనలేదు. బెయిల్ కోసం ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. కానీ అది కూడా సాధ్యపడలేదని తెలుస్తోంది. ఇలా నెలల తరబడి అజ్ఞాతంలో ఉండే కన్నా సిబిఐ అధికారుల ముందు హాజరై వారు అరెస్టు చూపితే బెయిల్ మీద రావచ్చని భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ కేసు విషయమై పార్టీ అధినేతను ఆమంచి కలసిన సమయంలో పర్చూరు ఇన్‌ఛార్జీ అంశం ప్రస్తావనకు వచ్చినట్లు చెబుతున్నారు. ఇప్పటికే జాప్యం జరిగిన క్రమంలో ఆమంచి ఒక నిర్ణయం తీసుకుని తన అనుచరులతో సమావేశం జరిపారు. పార్టీ అధినేత జగన్ చేసిన సూచన మేరకు తాను పర్చూరు వెళుతున్నానని, ఇక్కడ మీకు రాజకీయంగా ఎలాంటి ఇబ్బంది ఉండదని తన అనుచరులకు ఆమంచి చెప్పినట్లు తెలిసింది. చీరాలలో రానున్న ఎన్నికల్లో బిసి మహిళను వైసిపి అభ్యర్థిగా ప్రకటిస్తారని, మనమంతా అండగా నిలవాలని, తాను పర్చూరు వెళ్లినా చీరాలలో రాజకీయంగా ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆమంచి తన అనుచరులకు భరోసా ఇచ్చారు. అందరికీ తాను నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

5వ వార్డు కౌన్సిలర్లు సూరగాని లక్ష్మి

ప్రజాశక్తి-చీరాల

సైడుకాలువలను పరిశీలిస్తున్న సూరగాని లక్ష్మి నరసింహారావు

ప్రజా సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని 5వ వార్డు కౌన్సిలర్ సూరగాని లక్ష్మి తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు. 5వ వార్డు పరిధిలోని కటకంవారి వీధిలో మురిగినీరు పారుదలకు సైడు కాలువ లేకపోవడంతో స్థానికులు కౌన్సిలర్ లక్ష్మి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన స్పందించిన కౌన్సిలర్ అక్కడికి వెళ్లి ఆ ప్రాంత మహిళలతో మాట్లాడి సమస్యను గుర్తించారు. వెంటనే సంబంధిత అధికారులుతో, సచివాయ సిబ్బందితో మాట్లాడి ఆ ప్రాంత వాసుల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేశారు. ప్రాంతంలో సైడు కాలువలు నిర్మించేలా కృషి చేశారు. అందులో భాగంగా 5వ వార్డులో సూరగాని లక్ష్మి నరసింహారావు దంపతులు బుధవారం పర్యటించి సైడు కాలువల నిర్మాణాన్ని పరిశీలించారు. తమ సమస్యను అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేసి కౌన్సిలర్ సూరగాని లక్ష్మికి ఈ సందర్భంగా స్థానికులు కతజ్ఞతలు తెలిపారు. .

గ్రాండ్ క్రిస్మస్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వేగేశన నరేంద్ర వర్మ

19న గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

క్రిస్మస్ పండుగ సందర్భంగా ఈ నెల 19న వేగేశన ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాపట్లలోని సాల్వేషన్ ఆర్మీ గ్రౌండ్‌లో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్, టిడిపి బాపట్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో నరేంద్ర వర్మ మాట్లాడారు. గ్రాండ్ క్రిస్మస్ వేడుకలకు విజయవాడకు చెందిన ప్రముఖ అంతర్జాతీయ సువార్త ప్రసంగికులు పాల్.ఇమాన్యుల్ పాల్గొంటారన్నారు. అనంతరం గ్రాండ్ క్రిస్మస్ వేడుకలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న అశోక్‌బాబు

కొండపి : తుపాన్ కారణంగా పంటలను నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని కె.ఉప్పలపాడు గ్రామంలో వర్షానికి దెబ్బతిన్న పంటలను అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి బుధవారం పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండపి మండల వైసిపి నాయకులు , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జంకెకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైసిపి నాయకులు

వైసిపి జిల్లా అధ్యక్షుడు..

జంకెను కలిసిన 'కొండపి' నాయకులు

ప్రజాశక్తి-కొండపి

వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డిని మర్కాపురంలోని ఆయన నివాస గృహంలో కొండపి మండల వైసిపి నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజవకర్గంలో నెలకొన్న పరిస్థితుల గురించి ఆయనకు వివరించారు. కొండపి నియెజకవర్గంలో సీనియర్ నాయకులను ప్రక్కనపెట్టిన కొత్తగా వచ్చినవారికి బాధ్యతలు అప్పగించి పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని తెలిపారు. పార్టీ కోసం ఆస్తులను కూడా అమ్ముకొని పనిచేస్తున్నామని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, కొండపి సొసైటీ అధ్యక్షుడు బొక్కిసం ఉపేంద్రచౌదరి తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ బి.అరుణమ్మ, దివి శ్రీను, మర్రిపూడి అధ్యక్షుడు రమణారెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

శంకుస్థాపనలో ఎమ్మెల్యే కోన

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. మండల పరిధిలోని వైఎస్ఆర్ నగర్‌లో రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సౌలభ్యం కోసం ప్రతి సచివాలయ పరిధిలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందు బాటులో ఉంటారని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరు వులు, విత్తనాలు అంద జేస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రానైట్ స్లాబ్ విరిగిపడి కార్మికుడు మృతి

ప్రజాశక్తి గ్రోత్ సెంటర్

మృతిచెందిన రవికుమార్ యాదవ్

గ్రానైట్ స్లాబ్ విరిగి మీద పడటంతో ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మద్దిపాడు మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రోత్ సెంటర్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ టి. శ్రీరామ్ కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని నూరి గ్రామానికి చెందిన రవికుమార్ యాదవ్(22) చింతల ఎక్స్పోర్ట్స్ గ్రానైట్ కంపెనీలో కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజువారీ పనిలో భాగంగా ట్రైలర్‌పై రాళ్లను తరలిస్తుండగా రెండు గ్రానైట్ స్లాబ్‌లు విరిగిపడ్డాయి. రవికుమార్ యాదవ్ వాటి మధ్యలో ఇరుక్కోవడంతో తలకు గాయమైంది. ఈ విషయాన్ని గమనించిన తోటి కార్మికులు యాజమాన్యానికి సమాచారం అందించారు. అనంతరం ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మతి చెందాడు. మద్దిపాడు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మతుడి బావ అమర్ సింగ్ యాదవ్ ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీరామ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం

మార్టూరు రూరల్ :

మృతి చెందిన లక్ష్మీనారాయణ

ఆటో, దిచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మార్టూరు బస్టాండ్ సమీపంలోని జొన్నతాళి బస్ స్టాప్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రవీంద్రారెడ్డి కథనం ప్రకారం .. మండల పరిధిలోని ఇసుకదర్శి గ్రామానికి చెందిన కందుకూరి కోటేశ్వరరావు, ఆయన బంధువు మండెపూడి లక్ష్మీనారాయణ (62) ద్విచక్ర వాహనంపై జొన్నతాళి సర్వీస్ రోడ్డులో మార్టూరుకు వస్తున్నారు. మేకలు అడ్డురావడంతో ద్విచక్రవాహన అదుపుతప్పింది. అదే సమయంలో ఎదురుగా ఆటో, దిచక్ర వాహనం ఢీకొన్నాయి. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న కోటేశ్వరరావు, వెనుక కూర్చున్న లక్ష్మి నారాయణ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే లక్ష్మీనారాయణ మతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. మార్టూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి మృతి

ప్రజాశక్తి -చీరాల

మద్యం తాగి గొంతు ఎండిపోవడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఈపురిపాలెం స్ట్రైట్ కట్ కాలువ వంతెన సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... తోటవారిపాలెంకు చెందిన వి. ఓబులేష్‌కు వేటపాలెంకు చెందిన సుబ్బమ్మతో 25 సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. దంపతులిద్దరి మధ్య మనస్పర్ధలు రావటంతో పది సంవత్సరాలు వేర్వేరుగా జీవిస్తున్నారు. దీంతో ఓబులేష్ మద్యానికి అలవాటు పడ్డాడు. ప్రతి రోజూ మద్యం తాగి తిరుగుతుంటాడు. ఈ క్రమంలో ఈపూరుపాలెంలోని రాజయ్య దిబ్బ సమీపంలోని శివాలయం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో ఓబులేసు మృతదేహం పడిఉండటాన్ని స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఫుల్‌గా మద్యం సేవించి ఆహారం తీసుకోక పోవటం వల్ల గొంతు ఎండిపోయి మృతిచెందిఉండవచ్చునని కుటుంబసభ్యులు, పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తండ్రి సుబ్బారాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం

జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-పంగులూరు

తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందిస్తామని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మండల పరిధిలోని కొప్పెరపాడు, చందలూరు, నూజిలపల్లి గ్రామాల్లో వర్షానికి దెబ్బతిన్న శనగ, పొగాకు, మొక్కజొన్న ,మిర్చి, పంటలను వైసిపి అద్దంకి నియోజక వర్గ నియోజకవర్గం ఇన్‌ఛార్జి బాచిన కష్ణ చైతన్యతో కలిసి జాయింట్ కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ప్రస్తుతం వర్షం వల్ల దెబ్బతిన్న పొలాల్లో యూరియా నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలా చేస్తే కొంత పైరైన దక్కే అవకాశం ఉంటుందని తెలిపారు. పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయంలో అత్యధిక భాగంగా ఉన్న కౌలు రైతులు కౌలు కార్డు లేని కారణంగా నష్టపోతున్నారని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని

వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న జేసీ

రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయని వినోద్ బాబు జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. దీంతో స్పందించి జేసీ మాట్లాడుతూ పొలాలను పరిశీలించి ఎవరు వ్యవసాయం చేస్తున్నారో వారికే నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. శనగ, పొగాకు, పంటలు తీవ్రంగా నష్టపోయాయని ఈక్రాప్ చేయించుకోవాలని రైతులకు సూచించారు. బాచిన కష్ణ చైతన్య మాట్లాడుతూ వర్షం ప్రభావం వల్ల రైతాంగం పూర్తిగా నష్టపోయారని తెలిపారు. వారికి నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ జిల్లా అధికారి జెన్నమ్మ, అద్దంకి హార్టికల్చర్ అధికారి దీప్తి, ఎఒ సుబ్బారెడ్డి, మండల అభివద్ధి కమిటీ అధ్యక్షుడు రాయని వెంకట సుబ్బారావు, వైస్ ఎంపిపి ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, రైతులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.**మేదరమెట్ల :** తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలతో దెబ్బతిన్న పొగాకు, శనగ,మిర్చి పంట పొలాలను జాయింట్ కలెక్టర్ శ్రీనివాస కుమార్ పరిశీలించారు. మండల పరిధిలోని కనగాల వారిపాలెంలో ఆయన దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. దెబ్బతిన్న పంట నష్టాన్ని అంచనా వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైసిపి అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కష్ణచైతన్య, ఎఒ శ్రీనివాసరావు, తహశీల్దారు లక్ష్మీనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలి

- దెబ్బతిన్న పంటలను పరిశీలించిన రైతు, కౌలు రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి- ఇంకొల్లు రూరల్

తుఫాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు డిమాండ్ చేశారు. తుఫాన్ కారణంగా ఇంకొల్లు, దుద్దుకూరు, కొణికి, గంగవరం, తాటిపర్తివారిపాలెం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు అప్పులు చేసి వ్యవసాయాన్ని సాగు చేస్తున్నట్లు తెలిపారు. అధిక వర్షాలకు శనగ, పత్తి, మిరప పంటలు దెబ్బతిన్నాయన్నారు. అధికారులు దెబ్బ పంటలను పరిశీలించి నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపి రైతులకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు రాయిని వినోద్ బాబు మాట్లాడుతూ కౌలు రైతులు అధికంగా మిర్చి పంట సాగు చేశారన్నారు. ఈ పాటికే ఎకరాకు రూ.60 వేల మేర పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. వర్షానికి పంట

కొణికి వద్ద పంటలను పరిశీలిస్తున్న నాయకులు

మేదర మెట్లలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న నాయకులు

దెబ్బతినడంతో ఏమి చేయాలో అర్థం కాక లబోదిబో మంటున్నట్లు తెలిపారు. రాయితీపై రైతులకు విత్తనాలు, పురుగుమందులు అందజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి నలతోటి భానుప్రసాద్, రైతులు అత్తింటి శ్రీనివాసరావు, బేతాళ అశోక్, నూతలపాటి రాజేష్, గాలి యోహాను పాల్గొన్నారు.

మేదరమెట్ల : తుఫాను కారణంగా దెబ్బతిన్న అన్ని పంటలకు నష్టపరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు ఎం.ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షం కారణంగా మండల పరిధిలోని రావినూతల గ్రామంలో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ కార్మిక సంఘం బందం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పొగాకు, శనగ, మిర్చి పంటలు వర్షం కారణంగా 70 శాతం మేర దెబ్బతిన్నట్లు తెలిపారు. పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బొంత దశరథ, దాట్ల మాణిక్యరావు, వై.రవీంద్రబాబు, రోశయ్య ,కంచర్ల సురేష్, కొల్లా సుబ్బారావు పాల్గొన్నారు.

'జలజీవన్ మిషన్' పనులు వేగవంతం

కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

రానున్న వేసవిని దష్టిలో పెట్టుకొని జలజీవన్ మిషన్ పథకం పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె. విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారులతో స్పందన సమావేశ మందిరంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకం ద్వారా మంజూరైన పనులు సత్వరమే పూర్తి చేయాలన్నారు. జిల్లాలో తొలి విడతగా 699 పనులకు రూ.382.24 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. తాజాగా 723 పనులు కోసం రూ.205.22 కోట్లు నిధులు మంజూరైనట్లు తెలిపారు. నిధులు ఉన్నప్పటికీ పనులు ప్రారంభించకపోవడం ఏమిటని కలెక్టర్ అధికారులను నిలదీశారు. ప్రజాప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంచి ప్రణాళికలతో ముందుకు వెళ్తుంటే క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులలో చలనం ఉండడం లేదన్నారు. తాగునీటి సమస్య అధికంగా ఉన్న కొరిశపాడు మండలంలో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించక పోవడంపై కలెక్టర్ మండిపడ్డారు. నిధులు, వనరులు సమకూర్చినప్పటికీ అధికారులు ఎందుకు పనిచేయడం లేదంటూ నిలదీశారు. సామాజిక మరుగుదొడ్ల భవన సముదాయాల నిర్మాణం 2023-జనవరి 14 లోపు పూర్తిచేయాలన్నారు. జిల్లాలో 406 సామాజిక మరుగుదొడ్ల భవనాల నిర్మాణానికి రూ.12.18 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఇప్పటివరకు 401 పనులు ప్రారంభం కాగా 215 భవనాలు పూర్తయ్యాయని, మిగిలిన భవనాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. నేటికీ ఐదు పనులు ప్రారంభం కాకపోవడంపై ఆరాతీశారు. ప్రజల సామాజిక అవసరాలను దష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మంజూరు చేసిన పనులను తక్షణమే చేపట్టాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతను గుర్తించాలని కలెక్టర్ స్పష్టంచేశారు. నిర్లిప్తతతో ఇంజినీర్లు విధులు నిర్వహిస్తే కుదరదని కలెక్టర్ హెచ్చరించారు. సామాజిక అవసరాలైన తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించే అంశాలపై అధికారులు ప్రత్యేక దష్టి సారించాలన్నారు. ఇంటింటికీ కుళాయి కనెక్షను ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అభివద్ధి పనుల పురోగతిపై ప్రతిరోజూ నివేదికను కలెక్టరేట్‌కు పంపాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ. సిహెచ్. విద్యాసాగర్, డ్వామా పీడీ వై. శంకరనాయక్, ఇంజినీర్లు పాల్గొన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి

పర్చూరు : వార్షానికి దెబ్బతిన్న పంటలను కాపాడు కునేందుకు రైతులు అధజకారులు సూచనలు తప్పని సరిగా పాటించాలని ఎఒ యస్.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. భూమిలో అధిక శాతం తేమ ఉన్నందున శనగ సాగు చేసిన రైతులు భూమిలో తేమ శాతం తగ్గిన వెంటనే కార్బెండాజైమ్ మరియు మ్యాంకోజబ్ లేదా కార్బెండాజైమ్ మరియు మెటలాక్సైల్ లేదా కాపరాక్సై క్లోరైడ్ మందును పిచికారీ చేయాలన్నారు. శనగ పంటలో పచ్చ పురుగు నివారణ కోసం క్లోపైరిఫాస్ లేదా ఏస్ఫేట్ లేదా స్పినోశాడ్ లేదా ఇమామెసిటిన్ బెంజోట్ మందును శిలాంధ్ర నాశినితో కలిపి పిచికారీ చేయాలన్నారు. **ఇంకొల్లు రూరల్** మండల పరిధిలోని రైతులు తుఫాను కారణంగా దెబ్బతిన్న పంటల వివరాలను అందజేస్తే వారికి రాయితీపై విత్తనాలు అందిస్తామని ఎఒ వేణుగోపాల్‌రావు తెలిపారు. మండలంలోని ఇంకొల్లు, భీమవరం, కొణికి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ బెట్టకొచ్చిన పొలాల్లో పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. **భట్టిప్రోలు :** తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంట నష్టాన్ని అధికారులు నమోదు చేయాలని రేపల్లె ఎడిఎ సయ్యద్ అక్తర్ హుస్సేన్ తెలిపారు. అద్దేపల్లి గ్రామంలో దెబ్బతిన్న పంటలను ఎడిఎ పరిశీలించి రైతులకు సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రత్నరాజ్,రజని పాల్గొన్నారు.

గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆకట్టుకున్న సైన్సు ప్రదర్శన

ప్రజాశక్తి- పంగులూరు

సైన్స్‌డే సందర్భంగా మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులు, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో కొండ మంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అమర్తలూరి నిరంజన్ కుమార్, చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బెజ్జం దీన, మేఘన, అలవలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ నన్నేబి, రేణింగవరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన పిపిఎస్. తేజచారి గెలుపొందారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణయతలుగా విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పుట్టం రాజు శ్రీరామచంద్రమూర్తి, అద్దంకి మండలం తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కెవి. శ్రీనివాసరావు, కొరిశపాడు మండలం మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిఎస్ ఉపాధ్యాయులు పోతురాజు వ్యవహరించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు గుమ్మ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పర్చూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి కిరణ్ కుమార్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. విజేతలకు అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. అడ్డగడ సుబ్బయ్య ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కె.నాగభూషణం, జడ్‌పిటిసి రాయిని ప్రమీల, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముగ్గు కీర్తిశ్రీ, కెనరా బ్యాంకు మేనేజర్ అనిల్, గ్రామ పెద్ద దశరథ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు మణిలాల్

పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం : సిఐటియు

ప్రజాశక్తి -భట్టిప్రోలు

పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కరించు కోవచ్చునని సిఐటియు బాపట్ల జిల్లా అధ్యక్షుడు సిహెచ్. మణిలాల్ తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సిఐటియు మండల మహాసభ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షురాలు బి.రమాదేవి అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై పని భారాన్ని పెంచి వేతనాలలో కొర్రీ పెడుతున్నాయన్నారు.ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన మేర నిధులు కేటాయించ కుండా కార్మికుల చేత వెట్టిచాకిరి చేయిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. సిఐటియు మండల కార్యదర్శి జి.సుధాకర్ మాట్లాడుతూ ఈనెల 16,17 తేదీలలో చీరాలలో నిర్వహిస్తున్న సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా బి.రమాదేవి, ప్రధాన కార్యదర్శిగా జి.సుధాకర్, కమిటీ సభ్యులుగా సూర్య లక్ష్మి, మాధవి, నిర్మల, రమణ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకుడు వి.సురేష్,రైతు సంఘం నాయకులు కె.రామస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.సత్యనారాయణ, బసవకోట్లు తదితరులు పాల్గొన్నారు.



నాగార్జునరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

చిరస్మరణీయుడు నాగార్జున రెడ్డి

ప్రజాశక్తి-బేస్తవారిపేట

చెప్పిన మాటకు విలువ ఇచ్చి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ముందుండి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజల్లో ప్రజల్లో చిరస్మరణీయుడుగా వెలుగొందిన వ్యక్తిగా కంభం మాజీ ఎమ్మెల్యే కీ॥శే॥ కందుల నాగార్జున రెడ్డి గుర్తింపు తెచ్చుకున్నారని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల ప్రతాపరెడ్డి, రాయలసీమ సాధన సమితి అధ్యక్షులు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం స్వర్గీయ కందుల నాగార్జున రెడ్డి 75వ జయంతి సందర్భంగా బేస్తవారిపేట ఆర్కె నగర్ జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన నాగార్జున రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. అనంతరం సమీపంలోని దర్గా కొండపై త్రిలోక క్షేత్రం కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సభలో వారు నాగార్జునరెడ్డి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చీరాల వైసిపి నియోజకవర్గ ఇన్చార్జి కరణం వెంకటేష్, కార్పొరేషన్ చైర్మన్ బాలమురళీ కష్ణ, పొదిలి మాజీ ఏఎంసీ చైర్మన్ పాతకోట కృష్ణా రెడ్డి, గిద్దలూరు మాజీ ఎంపీపీ కడప వంశీధర్ రెడ్డి, తదితరులు నాగార్జున రెడ్డి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాగార్జున రెడ్డి కుమారుడు గౌతమ్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

చీమకుర్తిలో సిఐటియు జిల్లా మహాసభలు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సిఐటియు జిల్లా 12వ మహాసభలు చీమకుర్తి పట్టణంలోని బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి కళ్యాణ మండపంలో ఈనెల 27, 28 తేదీలలో జరుగుతాయని జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆఫీస్ బేరర్ల సమావేశం బుధవారం జరిగింది. సమావేశానికి ఎం రమేష్ అధ్యక్షత వహించారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా 12వ మహాసభ ప్రాధాన్యత చూసుకుంటే గత మూడు సంవత్సరాల నుంచి కరోనాకాలంలో ఉద్యోగులు కార్మికులందరికీ సమస్యలు పరిష్కారం కావాలని కరోనా సమస్యలు పరిష్కారం కావాలని సిఐటియు అహర్నిశలు పనిచేసిందన్నారు. కరోనా కాలంలో అనేక సహాయ కార్యక్రమాలు చేపట్టామని, ప్రధానంగా గ్రానైట్ రంగంలో యజమానులు ఒత్తిడి ప్రభుత్వ విధానాల ఫలితంగా కార్మికులు వలసలు వెళ్ళటం క్వారీలు మూసివేయడం జరుగుతున్న నేపథ్యంలో సిఐటియు ఆందోళనలు నిర్వహించి కార్మికులకి అండగా నిలిచిందన్నారు. చీమకుర్తి పట్టణంలో కార్మిక కేంద్రంలో ఈ మహాసభలు జరగటం ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులు కార్మికులు పట్ల అనేక వ్యతిరేక చట్టాలు తీసుకు వచ్చాయని, ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం 27 చట్టాలను మార్చి లేబర్ కోడ్లుగా మార్చిందన్నారు. వీటి అమలు చేయాలని రాష్ట్రాలపై ఒత్తిడి జరుగుతుందని, అమలు చేయడానికి పూనుకున్న సందర్భంలో సిఐటియు వ్యతిరేకించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రవాణా రంగంపై అనేక భారాలు వేసిందని, ప్రతినెల జీతాలు చెల్లించే పరిస్థితి లేదన్నారు.

మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు

ఇలాంటి పరిస్థితుల్లో అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజనం, విఆర్ఒ, విఓఎ ,మెప్మా ఆర్‌పి రకరకాల కార్మికుల సమస్యలపై పనిచేశామన్నారు. మున్సిపల్, స్వచ్ఛ భారత్, ఆటో, భవన నిర్మాణం ,హమాలీ, విఆర్‌ఎ సంఘం సమస్యలపై పనిచేసిందన్నారు. ఈ మహాసభల్లో మొత్తం సమీక్ష చేసి రాబోయే మళ్లీ రెండు సంవత్సరాలకి దిశా ,నిర్దేశం చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. మహాసభలు జయప్రదం చేయాలని ఉద్యోగ, కార్మిక వర్గాన్ని అభ్యుదయ, పజాతంత్ర వాదులకు విజ్ఞప్తి చేశారు. గతంలో ఈనెల 17 ,18 తేదీలలో మహాసభలు జరపాలని నిర్ణయిం చామని, .అనివార్య కారణాలతో 27,28 తేదీల్లో జరపా లని నిర్ణయించామన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, కాలం సుబ్బా రావు, టి రాము ఎం.అయ్యప్ప రెడ్డి, జివి రాగయ్య, పారా శ్రీనివాసరావు, పిసి కేశవరావు, తాండవ రంగారావు, టి మహేష్, దామా శ్రీనివాసులు, ఈదర అన్నపూర్ణ, బంకా సుబ్బారావు ,పి.ఆంజనేయులు పాల్గొన్నారు.

రీసర్వే నిస్పక్షపాతంగా జరగాలి

ఆర్‌డిఓ విశ్వేశ్వరరావు

ప్రజాశక్తి-ముండ్లమూరు

రీ సర్వేను నిస్పక్షపాతంగా నిర్వహించాలని ఒంగోలు ఆర్‌డిఒ విశ్వేశ్వరరావు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం గ్రామ రెవిన్యూ అధికారులు, సచివాలయ సిబ్బందికి రీ సర్వేపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రీ సర్వే ఈ పాటికే మొదలైందని రిసర్వే చేసేటపుడు గ్రామాలలోని రైతులకు తెలియపరచి సర్వే చేసేటపుడు వారి పొలాల్లోని హద్దులను రైతులు పరిశీలించుకోవాల్సి ఉంటుందని డ్రోన్ కెమెరాల ద్వారా పొలాలు సర్వే జరుగుతుంది కాబట్టి ఎక్కడా ఎటువంటి అవకతవకలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన వారికి సూచించారు. ఈ రిసర్వే కోసం గ్రామాల వారిగా విలేజ్ సర్వేయరు ,విఆర్ఓ అగ్రికల్చర్ అసిస్టెంటు మరి కొంత మంది సభ్యులతో టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సర్వే చేసేముందు గ్రామాల వారిగా గ్రామాలలోని రెవిన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు జరుగుకుండా సర్వే నెంబరు సరిచూసుకొని రైతులకు ఎటువంటి ఇబ్బందికల్గుకుండా పగడ్బంధీగా సర్వే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్ ఉషారాణి, డిటి జి పుల్లారెడ్డి, ఆర్ఐ రవికాంత్, సీనియర్ అసిస్టెంటు శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు వాలంటీర్లు తొలగింపు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండలంలోని అమానుగుడిపాడు గ్రామం లో వాలంటీర్లుగా పని చేస్తున్న వి గోపిరాజు, పి శ్రీనివాసులు, డి వెంకటశివ, ఈ ఏసులయ్య అనే నలుగురిని విధుల నుంచి తొలగించినట్లు ఎంపిడిఒ ఎం రంగసుబ్బ రాయుడు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నలుగురు వాలంటీర్లు స్థానికంగా ఉండడం లేదన్నారు. సక్రమంగా విధులు నిర్వహించడం లేదని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ఆయుష్మాన్ భారత్ సర్వే చేయుటలో చాలా నిర్లక్ష్యం వహించినట్లు పంచాయితీ కార్యదర్శి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అనంతరం విచారణలో కూడా విధులు సక్రమంగా నిర్వహించనందున తొలగించినట్లు తెలిపారు. వారి వద్ద ఉన్న మొబైల్, సిమ్‌తో పాటు యావత్తు రికార్డులు అప్పగించవలసినదిగా తెలిపారు.

జగన్ ప్రభుత్వాన్ని సాగనంపుదాం

మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణంలోని విశ్వబ్రాహ్మణ ఆరామ క్షేత్రములో ఉన్న కట్టడాలను ప్రభుత్వ అధికారులు కూల్చి వేసిన నేపథ్యంలో ఆరామ క్షేత్ర పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం సంఘ నాయకులు శామంతపూడి నాగేశ్వరరావు నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సంఘీభావం తెలుపుటకు విచ్చేసిన మార్కాపురం మాజీ శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి గారు మాట్లాడుతూ ఆరామ క్షేత్రం విషయంలో కోర్టు తీర్పు ఇచ్చినంత మాత్రాన కనీసం అప్పీలుకు వెళ్లే సమయం కూడా ఇవ్వకుండా తీర్పు వచ్చిన గంటల్లో క్షేత్రంలో ఉన్న కట్టడాలను అధికారులు వైసీపీ నాయకుల ప్రోత్బలంతోనే కూల్చివేశారన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున విశ్వబ్రాహ్మణ సోదరులు, సోదరీమణులు, నాయకులు, బీసీ సోదరులు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-తర్లుపాడు

క్రీస్తు పుట్టుక లోక రక్షణ కొరకే అని దైవజనులు అల్ఫా గ్లోబల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ ఎన్. విజయభాస్కర్‌రావు అన్నారు. తర్లుపాడు మండలంలోని గొల్లపల్లి గ్రామంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని దైవ సందేశమిచ్చారు. క్రిస్మస్ అంటేనే ఆనందమని తెలిపారు. అనంతరం 36 మంది పేద మహిళలకు, వితంతువులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్ద వేశపోగు జాన్, పాస్టర్ మేడిపల్లి రామయ్య, పౌలురాజు, ఇస్మాయిలు, యోసే పులతోపాటు అల్ఫా గ్లోబల్ మినిస్ట్రీస్ జాయింట్ సెక్రెటరీ పాస్టర్ బొంత రామయ్య, ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుల సేవలో భాగస్వాములు కావాలి

సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

గ్రామ వ్యవసాయ సహాయకులు రైతుల సేవలో భాగస్వాములు కావాలని మార్కాపురం సబ్ కలెక్టర్ సేతుమాధవన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనం నందు జిల్లా వనరుల కేంద్రం ఒంగోలు వారి ఆధ్వర్యంలో మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలోని ఆర్.బీ.కె సిబ్బందికి ప్రస్తుత పంటలపై అవగాహన కార్యక్రమం ఎఒ దేవిరెడ్డి శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ ఆర్‌బీకె సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ, ప్రతీ రోజు క్షేత్ర స్థాయి పర్యటన చేస్తూ, పంటలలో వచ్చే తెగుళ్ల గురించి, సూక్ష్మ పోషకాల లోపాల గురించి తెలియజేస్తూ, వారికి సలహాలు, సూచనలు ఇవ్వాలని, తెలియజేసారు. ముఖ్యంగా తుపానులు సంభవించినప్పుడు ఆ సమయంలో రైతులు ఆచరించవలసిన పద్ధతుల గురించి రైతులకు వివరించాలన్నారు. ఆత్మా పీడీ అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు తమ పంట పొలాల యందు ఎక్కువగా రసాయనిక

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ సేతుమాధవన్

ఎరువులు వాడటం మరియు సేంద్రియ ఎరువులు మరియు జీవన ఎరువులు వాడకాన్ని తగ్గించడం వలన భూమి నిస్సారమవుతుందని, ఇందుములంగా మొక్కకు కావాల్సిన పోషకాలు అందక వేసిన పంటలు ఎదుగుదల లేక, దిగుబడి తగ్గడమే కాకుండా, నాణ్యత కూడా తగ్గుతుందని ఆమె తెలియజేసారు. అదేవిధంగా ఒంగోలు డాట్ శాస్త్రవేత్త రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరి, మొక్కజొన్న, మినుము పంటలలో చేపట్టవలసిన సమగ్ర సశ్యరక్షణచర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు మార్కాపురం రమాదేవి, పెద్దార వీడు ఎఒ బుజ్జిబాయి, తర్లుపాడు ఎఒ చంద్రశేఖర్, కంభం ఎఒ స్వరూప, అర్ధవీడు ఎఒ మహమ్మద్, డిఆర్‌సి ఎఒ శైలజ , ఎఇఒ పాపా రావు మరియు మార్కాపురం సబ్ డివిజనల్ పరిధిలోని ఆర్.బీ.కె సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాలి: సిఐటియు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఒంగోలు కార్పొరేషన్‌లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు రక్షణ పనిముట్లు ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) నగర వర్కింగ్ సెక్రటరి శ్రీరామ శ్రీనివాసరావు బుధవారం ఒకప్రకటనలో కోరారు. ఇళ్లనుంచి సేకరించిన చెత్త నుంచి తడిచెత్త, పొడిచెత్త వేరు చేయాలని కార్మికులమీద అధికారులు ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఓవైపు చలికాలం, మరోవైపు వర్షాలతో పని ప్రదేశాలలో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో కార్మికుల చేతులకు బ్లౌజులు ఇచ్చి పారిశుధ్య పనులు చేయించడం అధికారుల కనీస ధర్మమని గుర్తు చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతో కార్మికులమీద అదనపు పనిభారం మోపే విధానాలను మానుకోవాలని కోరారు. కార్మికులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ స్లిప్పులలో తప్పులను సరిచేయాలని కోరారు. చనిపోయిన కార్మికుల బదులు వారి కుటుంబసభ్యులను వెంటనే పనిలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధం : ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలుపు తమ పార్టీదేనని, పార్టీ విజయం కోసం కృషిచేసిన వారికి తప్పక గుర్తింపు ఉంటుందని కనిగిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలియ జేశారు. కనిగిరి పట్టణంలోని అమ రావతిగ్రౌండ్‌లో హెచ్‌ఎం పాడు, పిసిపల్లి నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృష చేయాలని ,ప్రజాక్షేత్రంలో నిలవాలని

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర

అన్నారు. ఈకార్యక్రమంలో పిపిపల్లి మండల టిడిపి అధ్యక్షుడు వేమూరి రామయ్య, హెచ్‌ఎంపాడు మండల అధ్యక్షుడు ఎస్‌టిఆర్ ,గ్రామపార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ నష్టపరిహారం అందాలి

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలో మాండూస్ తుఫాను ప్రభావం, అధిక వర్షా లతో దెబ్బతిన్న పంటలకు సం బంధించి నష్టపోయిన ప్రతి రైతుకు నష్టప రిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కొండపి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు సూచించారు. బుధవారం స్థానిక కొండపి రోడ్డులోని కార్యాలయంలో ఆయన వ్యవసాయ అధికారులతో తుపాను ప్రభావంతో జరిగిన పంట నష్టాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మండలంలో రైతులు సాగుచేసిన పంటలు, విస్తీర్ణం, ఏయే

పంటల పరిశీలనలో పరికోటి బాబు

పంటలు సాగు ఎంత అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి స్వర్ణలత, రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, వైసిపి సీనియర్ నాయకులు బీనీడి ఉదయకుమార్, ఉప్పలపాటి సత్యనారాయణ రాజు, టి రామకష్ణ తదితరులు ఉన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -శింగరాయకొండ

ఒంగోలు మినీ స్టేడియంలో బుధవారం జరిగిన అండర్ 14.17 బాల బాలికల బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి సెలక్షన్స్ లో శింగరాయకొండ మండలం మూలగుంట పాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.కె అంజు పర్వీన్ ఎనిమిదో తరగతి, ఎస్.కె ఆసిఫ్ 9వ తరగతి విద్యార్థులు ఎంపిక కావడం జరిగింది. ఈ విద్యార్థులను ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు జే కేశవరాజు , వ్యాయామ ఉపాధ్యాయుడు కే మాల్యాద్రి సయ్యద్ జంషీర్ అబ్దల్, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

450 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-పామూరు

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా సిఐ కె. శ్రీనివాసరావు, ఎస్ఐ సురేష్ యాదవ్‌లు పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ శ్రీనివాసరావు తెలిపారు. సిఎస్‌పురం మండలం రాజుపాలెం నుండి రేషన్ బియ్యాన్ని నెల్లూరు జిల్లాకు తరలిస్తుండగా సమాచారం మేరకు హైవే రోడ్‌లోని డివి మనోహార్ ఆర్చీ వద్ద పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. వాహన డ్రైవరు, క్లీనరును అదుపులోకి తీసుకుని పూర్తి సమాచారం కోసం సేకరిస్తున్నట్లు సిఐ తెలిపారు.

వినికిడి యంత్రం అందజేత

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని కందులూరు గ్రామానికి చెందిన ఉప్పలపాటి శ్రీనివాసులు గత కొంతకాలంగా వినికిడి లోపంతో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని గ్రామ ముఖ్య నాయకుడు ఉప్పలపాటి రామరాజు కొండపి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు దష్టికి తీసుకెళ్లారు. అశోక్ బాబు ఆదేశాలతో గ్రామ నాయకులు మన్నం వెంకయ్య కషితో వినికిడి యంత్రాన్ని బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలువురు నాయకులు ఉప్పలపాటి రామరాజు, మన్నం వెంకయ్య తదితరులకు కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పసుమర్తి ఈశ్వరమ్మ, నాయకులు ఉప్పలపాటి సత్యనారాయణ రాజు, రామిశెట్టి దాసయ్య, పసుమర్తి ఆనంద్, పసుమర్తి రాజేష్ తదితరులు ఉన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-మద్దిపాడు

పేద ప్రజలు ఆర్థికంగా అభివద్ధి చెందటమే జగన్ ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే టీజెఆర్ సుధాకర్‌బాబు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని నెలటూరు గ్రామములో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముందుగా ఎస్‌సి కాలనీ, బీసీ కాలనీలు ఊరులోని ప్రతి గడపకు తిరిగి ఇంటిలోని ప్రతి ఒక్కరిని పలకరించి ప్రభుత్వపథకాలు అందుతున్నాయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. రోడ్లు సైడ్ కాలువలు పరిశీలించినారు. పిఆర్‌డిఇతో అప్పటి కప్పుడే మాట్లాడి వివిధ గ్రాంట్లు ద్వారా నిధులు మంజూరు చేయించారు. వీరి వెంట ఎంపిపి వాకా అరుణ కోటిరెడ్డి, సర్పంచి మహాలక్ష్మి నాయకులు పాకనాటి మహానంద రెడ్డి బత్తుల శ్రీను, పంచాయితీ రాజ్. డిఇ కష్ణమోహన్, హౌసింగ్ ఎఇ హేమలత, సహాయకులు. సందీప్ , ఏపి ఎంసిలు బి నరేంద్ర కుమార్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఉపాధ్యక్షుడు గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి సంతనూతలపాడు రూరల్

సంతనూతలపాడు వాసవి క్లబ్ ఉపాధ్యక్షుడు వేమా పాండురంగారావు (56) గుండెపోటుతో హైదరాబాద్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మతి చెందారు. బుధవారం సంతనూతలపాడులో పాండురంగారావు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జిల్లా ప్రతినిధులు విఎన్ ప్రసాద్ రావు, జిఎల్ ప్రసాదరావు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జి శరత్ బాబు, ఏఎంసి వైస్ చైర్మన్ జి పాండురంగారావు, మాజీ వైస్ చైర్మన్ ఎస్‌వి సుబ్బారావు, ఆర్యవైశ్య కళ్యాణ మండపం అధ్యక్షుడు వేమా మల్లేశ్వరరావు, కోశాధికారి వేమా చిన్న వెంకట కష్ణారావు, సెక్రటరీ పి ఆంజనేయులు, ఆర్యవైశ్య నాయకులు చక్కా సుబ్బరాయుడు, వేమా అంకం శెట్టి వేమా సుబ్బారావు. వేమా రామారావు, వేమా శ్రీనివాసరావు, ఎస్ వెంకన్న , సీనియర్ జర్నలిస్టు శిఖాకొల్లి శ్రీనివాసరావు తదితరులు నివాళులర్పించారు.

మానసిక వికలాంగులను ఆదరించాలి

సబ్ కలెక్టర్ మాధవన్

ప్రజాశక్తి-మార్కాపురం

మానసిక వికలాంగులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని, గౌరవించాలని మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్ కోరారు. స్థానిక జవహార్‌నగర్ కాలనీలోని స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల పాఠశాలను సబ్ కలెక్టర్ మాధవన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మానసిక వికలాంగుల యోగ క్షేమాల గురించి తెలుసుకున్నారు. తనవంతు సాయం అందిస్తానని చెప్పారు. మానసిక వికలాంగులకు సేవలందిస్తున్న స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులను ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాధవన్ అభినందించారు.

ఆలస్యంగా ప్రారంభమైన మండల సమావేశం

ప్రజాశక్తి-పిసిపల్లి

మాట్లాడుతున్న ఎంపిపి అత్యాల జఫన్య

పిసిపల్లి మండల సర్వసభ్య సమావేశం కోరం లేక 11గంటలకు ప్రారంభం కావాల్సిన ఉండగా అధికారుల గైర్హజరు వల్ల 12:40గంటలకు ప్రారంభమైంది. మొత్తం 11 మంది ఎంపిటిసిలలో 10 మంది అధికార పార్టీకి చెందిన వారే. అధికార పార్టీకి చెందిన ముఖ్య నేతలైన మురుగుమ్మి ఎంపిటిసి చెరుకూరి సతీష్‌తోపాటు ఇద్దరు వైస్‌ఎంపిపిలు, చెరుకూరు ప్రసూన, బండారు రామకృష్ణ, తలకొండపాడు ఎంపిటిసి సమావేశానికి రాలేదు. గుంటుపల్లి, చింతగుంపల్లి, పెదఇర్లపాడు, పిసిపల్లి, ఎంపిపిలు మాత్రమే హాజరయ్యారు. సమావేశం నిర్వహించేందుకు అవసరమైన కోరం లేదు. ఎట్టకేలకు మధ్యాహ్నం 12:40 గంటలకు ముద్దపాడు ఎంపిటిసి మూలే సీత హాజరు కావడంతో సమావేశం ప్రారంభమైంది.సమావేశానికి సర్పంచుల్లో కొద్ది మంది మాత్రమే హాజరయ్యారు వారు కూడా సంతకాలకే పరిమితం అయ్యారు. సమావేశంలో కూడా ఇతరులు ప్రవేశించి అధికారులను ప్రశ్నించారు. ఎంపిపి అత్యాల జఫన్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జఫన్య మాట్లాడుతూ నిమ్జ్ ప్రాంతంలో ఉన్న లింగన్న పాలెంలో గ్రామానికి 200 మీటర్ల దూరంలో కంచె ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశారని, దాని వలన భవిష్యత్తులో లింగన్నపాలెం ప్రజలు ఇబ్బందులు పడతాయని ఆయన ఆవేదన చెందారు. భవిష్యత్తు అవసరాల రీత్యా గ్రామానికి కిలో మీటర్ దూరంలో కంచెను ఏర్పాటు చేయాలని తహశీల్దార్‌ను కోరారు. పనుల్లో మరియు నిధులు కేటాయింపులో జడ్‌పిటిసిలకు ప్రాధాన్యత ఇవ్వాలని భూమిరెడ్డి కొండారెడ్డి అడిగారు. ఉపాధి పనుల్లో పంచాయితీకి 20 పనులు మాత్రమే చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఎపిఓ గడ్డం రాంబాబు అన్నారు.ఈ సమావేశంలో ఎంపిడిఓ డివి.రమణారెడ్డి, తహశీల్దార్ ఎస్.వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయితీరాజ్ ఎఇలు మోహన్‌రావు, తిరుపాలయ్య, ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ నాగరాజ్యలక్ష్మీ, పశువైద్యులు డాక్టర్ పేరయ్య, ఎంఇఓ జె.ప్రసాదరావు, ఇఓఆర్‌డి డి.నాగమల్లేశ్వరి, కెజిబివి ప్రిన్సిపల్ బి.సుజాత, ఎస్ఐ నాగేశ్వరరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జరీనాబేగం, జడ్‌పిటిసి పెద్దిరెడ్డి లక్ష్మీకాంతం, వైసిపి నాయకులు బొర్రారెడ్డి, ఒకేరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

మార్కాపురం సిఐ భీమానాయక్

ప్రజాశక్తి-మార్కాపురం

మాట్లాడుతున్న సిఐ భీమానాయక్

ర్యాగింగ్ బూతం జోలికి వెళ్లి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, ఉన్నత చదువులతో జీవితాన్ని బంగారుమయం చేసుకోవాలని మార్కాపురం సిఐ ఎంభీమానాయక్ విద్యార్థులకు సూచించారు. స్థానిక ఎ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు బుధవారం జరిగింది. ముఖ్య అతిధులుగా సిఐ భీమానాయక్‌తో పాటు మార్కాపురం రూరల్ ఎస్ఐ సుమన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో కష్టపడి చదివిన వారికి బంగారు భవిష్యత్ ఉందన్నారు. ర్యాగింగ్‌పై ఒక్కసారి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైతే ఆ వ్యక్తి జీవితం ఎందుకూ పనికిరాదన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి, కష్టపడి చదవాలని సూచించారు. ర్యాగింగ్‌కు దూరంగా ఉండేలా మంచి సందేశాన్ని అందించిన సిఐ భీమానాయక్‌తో పాటు రూరల్ ఎస్ఐ సుమన్‌లను ఆ కళాశాల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలిబేగ్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ శ్రీధర్ పాల్గొన్నారు.

రిసెప్షన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

త్వరలో ముఖ్యమంత్రి రాక

ప్రజాశక్తి-దరిశి

ఎమ్మెల్యే డాక్టరు మద్దిశెట్టి వేణుగోపాల్ కుమారుడు రాజీవ్-రోహిత లకు వివాహ రిసెప్షన్ వేడుక త్వరలో జరుగుతుందని ఆ వేడుకకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజర వుతారని స్థానిక ఎమ్మెల్యే తెలిపారు. బుధవారం స్దానిక ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయం దగ్గర జరిగే వివాహా రిసెప్షన్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈనెల 15న జరగాల్సిన వివాహా రిసెప్షన్ వేడుక మాండూస్ తుఫాన్ కారణంగా వాయిదా పడిన సంగతి విధితమే. త్వరలో రిసెప్షన్ వేడుక జరుగుతుందని ఆయన తెలిపారు. త్వరలో తేదీన ప్రకటిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరుడు మద్దిశెట్టి శ్రీధర్, ఎఎంసి చైర్మన్ వైవి సుబ్బయ్య, రాష్ట్రకార్పోరేషన్ డైరెక్టరు కుమ్మిత అంజిరెడ్డి, వైసిపి మండలపార్టీ అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, సాంబయ్య, చెన్నారెడ్డిలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎస్‌జిఎఫ్ అండర్ 14 సెటిల్ పోటిలలో మార్కాపురంకు చెందిన జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు షేక్ అమ్మార్, సయ్యద్ ఫయాజ్‌లు బుధవారం ఒంగోలులో అండర్ 14 సింగిల్స్ సెలెక్షన్ లో అర్హత సాధించి రాష్ట్రస్థాయి పోటీలకుఎంపిక అయ్యారు. ఈ ఇరువురు విద్యార్థులు ఈ నెల డిసెంబర్ 26, 27, 28న మదనపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొనబోతున్నారు. జిల్లా పరిషత్‌బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

పిసిపల్లి : స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ తరపున రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలకు ప్రకాశం జిల్లా నుంచి స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నరసింహం, వ్యాయామ ఉపాధ్యాయుడు మాల్యాద్రిలు బుధవారం తెలిపారు. అండర్-14లో ఎం.సాయిసంజయ్, ఐ.వరుణ్‌సాయి, టివిఎస్.గణేష్, మరియు అండర్-17 సిహెచ్.వంశీమోహన్‌కష్ణ ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈ నెల 17, 18వ తేదీన రాయవరం, కమలాపురంలలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

యర్రగొండపాలెం : ఒంగోలు నగరంలోని డాక్టర్ పి ఆనంద్ మినీ స్టేడియంలో బుధవారం జరిగిన ఉమ్మడి ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ 2022-23 షటిల్ బ్యాడ్మింటన్ అండర్ 17 బాలుర సెలక్షన్స్‌లో యర్రగొండపాలెం చైతన్య ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి జమ్మోజు హర్షవర్ధనాచారి రాష్ట్ర స్థాయిలో జరిగే షటిల్ బ్యాడ్మింటన్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి లక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయుడు జి మహేష్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షవర్ధనాచారికి అభినందనలు తెలిపారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

ప్రజాశక్తి-మద్దిపాడు

తుపాన్‌కు దెబ్బతిన్న శనగ పొగాకు మిరపమినుము పంటలవివరాలను జిల్లా కలెక్టర్ కు పంపామని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని నందిపాడు, దొడ్డవరప్పాడు, గుండ్లాపల్లి గ్రామాలలోని పంట పొలాలను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో డాట్ సెంటర్ శాస్త్రవేత్త జి.రమేష్‌బాబు, గ్రామ సర్పంచ్ బి.రాము పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: మాండూస్ తుపాన్‌కు దెబ్బతిన్న శనగ, ధనియాల పంటలను మండల వ్యవసాయాధికారి పి.వెంకట్రావు బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఘట్టమనేని అశోక్, నారయ్య, సుబ్బయ్య, ఆంజనేయులు, వేణుగోపాల్, కోటేశ్వరరావు, శేషయ్య పాల్గొన్నారు

అధికారులతో మాట్లాడుతున్న ఆశా కార్యకర్తలు

గుండెపోటుతో ఆశా కార్యకర్త మృతి

ప్రకాశక్తి-మద్దిపాడు

గుండెపోటుతో ఆశాకార్యకర్త మృతిచెందిన ఘటన మండలంలోని గుండ్లాపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. ఆశా కార్యకర్తగా పనిచేస్తున్న తలకాయల సుకన్య(36) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె మతదేహాన్ని స్థానిక పిహెచ్‌సి డాక్టర్ డి.మానస, ఆశా కార్యకర్తలు సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిఐటియు మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి ఉన్నారు. అనంతరం ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఒంగోలులోని డిఆర్‌ఓ ఎంసిహెచ్ ఓబులేష్‌కు మరణించిన ఆశావర్కర్ కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లాకార్యదర్శి పి.కల్పన ఉన్నారు.

వరుడిని ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే స్వామి, సత్య

వరుడికి ఎమ్మెల్యే ఆశీర్వాదం

ప్రజాశక్తి, జరుగుమల్లి

మండలంలోని నర్సింగోలు గ్రామంలో పాతూరి రాఘవ స్వామి కుమారుడు హరికృష్ణ వివాహ వేడుక బుధవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యా హాజరై , వరుడిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాతూరి కోటేశ్వరరావు, కొమ్మాలపాటి కృష్ణ, బత్తిన పూర్ణచంద్రరావు, రాయపాటి శేషయ్య పలువురు నాయకులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తలను వేర్వేరుగా ఉంచాలి

ప్రజాశక్తి-మార్కాపురం

క్లీన్ ఆంధ్రప్రదేశ్, క్లీన్ మార్కాపురం కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపాలిటీలోని 25వ వార్డులో బుధవారం నిర్వహించిన ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో 25వ వార్డు కౌన్సిలర్ చాటకొండ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ బిఎస్ గిరికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్‌రసూల్, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలి

ప్రజాశక్తి-వెలిగండ్ల

నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్న జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాల్సిన అవసరం ఎంతైనా ఉందని టిడిపి మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వెదుళ్ళచెరువు గ్రామంలో మన రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు కర్నాటి భాస్కర్‌రెడ్డి, మండల తెలుగు రైతు అధ్యక్షుడు మీనిగ కాశయ్య, క్లస్టర్ యూనియన్ అధ్యక్షుడు పెరుగు శివన్నారాయణ పాల్గొన్నారు.

వ్యవసాయం పట్ల అవగాహన లేని ప్రభుత్వం

అద్దంకి ఎమ్మెల్యే గొట్టి పాటి రవికుమార్

వర్షానికి దెబ్బతిన్న పైర్లను పరిశీలిస్తున్న, ఎమ్మెల్యే గొట్టిపాటి వికుమార్

ప్రజాశక్తి-పంగులూరు

వ్యసాయం పట్ల అవగాహన లేని జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి ఉండటం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి ఏ పంటకు ఎంత పెట్టుబడి పెట్టారు. ఎంత నష్టపోయారు అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే రవికుమార్ విలేకర్లతో మాట్లాడుతూ మూడేళ్లుగా వర్షాలు పుష్కలంగా కురుస్తూ, కావాల్సినంత సాగునీరు ఉన్నా రైతులకు ఒరిగిందేమీ లేదని తెలిపారు. రైతుల ఆత్మహత్యలలో రాష్ట్రం మూడో స్థానంలో ఉందన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వంలో రైతులు బాగుంటే ఈ ఆత్మహత్యలు ఎందుకు జరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తడిసిన ధాన్యం, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు ఆయన కోరారు. వర్షాలకు దెబ్బతిన్న మినుము, మిర్చి, మొక్కజొన్న, శనగ, పొగాకు పంటల నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలన్నారు. బర్లీ పొగాకు సుమారు 7,500 ఎకరాల్లో సాగు చేశారని, వర్షం ధాటికి పంట అంతా పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలిపారు. శనగ పంటకు 80 శాతం సబ్సిడీతో విత్తనాలు ఇస్తామని అధికారులు చెప్పటం సరికాదన్నారు. విత్తనాలతో పాటు నష్టపరిహారం కూడా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. మొక్కజొన్న పంట 15 వేల ఎకరాల్లో సాగు చేశారని, ఎకరాకు రూ.20 నుంచి రూ.25 వేల వరకూ రైతులు పెట్టుబడులు పెట్టినట్లు తెలిపారు. పంట మొత్తం మునుగటంతో రైతులు కన్నీరు పెడుతున్నారని తెలిపారు. టిడిపి ప్రభుత్వ హయంలో వాతావరణం మార్పులు, తుఫానులు, భారీ వర్షాలు, వరదలు, అకాల వర్షాలు, పిడుగుపాటు తదితర సమాచారమంతా ఎప్పటికప్పుడు వాతావరణ శాఖ,ఇస్రో తదితర సంస్థల భాగస్వామ్యంతో రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా అధ్యయనం చేసి ఆయా శాఖలను సకాలంలో అప్రమత్తం చేసి,1100 కాల్ సెంటర్, పరిష్కార వేదిక ద్వారా ముందస్తు హెచ్చరికలతో నష్ట నివారణ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రకతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వమే ముందుకొచ్చి నష్టపోయిన వారిని ఆదుకోవాలన్నారు. నష్టపోయిన రైతులను, పేదలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు ఊడిపోయి నెలలు గడుస్తున్నా నేటికీ పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టలేదని తెలిపారు. వైసిపి ప్రభుత్వానికి రైతుల పట్ల బాధ్యత లేదనీ ఆయన దుయ్యబట్టారు. రైతులకు అవసరమైనప్పుడు నీళ్ల రావని, వర్షం పడుతున్న అధికారులు కాలువల ద్వారా నీళ్ల వదులుతున్నారని ఆయన విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో కాలవ గట్టులు తెగటం, నీళ్ల పంటలపై పడి పంట నష్టం జరగటం జరుగుతుందన్నారు. అన్నదాతకు పార్టీలు అంటగట్టి వచ్చిన ఇన్సూరెన్స్ వెనక్కి పంపిన ఘనత జగన్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కమిటీ అధ్యక్షుడు రావూరి రమేష్, నాయకులు ఏడుకొండలు, షేక్ మస్తాన్ వలి, కోమటి ప్రసాదు, ఆదిరెడ్డి, గొట్టిపాటి ఖాజా పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైన్సు ఎగ్జిబిషన్

సైన్సు ఎగ్జిబిషన్ సందర్శిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

పావులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మండల స్థాయి సైన్స్ మరియు గణిత ఎగ్జిబిషన్ బుధవారం నిర్వహించారు. మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలు, మండల పరిషత్ యాజమాన్యంలోని యుపి పాఠశాలలకు చెందిన విద్యా ర్థులు మొత్తం 45 ప్రదర్శనలు ప్రదర్శించారు. పర్చూరు ప్రాంతీయ ఉప విద్యాశాఖ అధికారి ఏ.కిరణ్ కుమార్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ పోటీల్లో యోగ శ్రీచరణ్, రావు అక్షయ, బాచిన రమేష్ చౌదరి, బి ఉమ, బి. కుసుమ ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణయితలుగా మేడూరి సత్యనారాయణ, విఠలేశ్వర్‌రావు తదితరులు వ్యవహరించారు. విజేతలకు గ్రామ పెద్ద కొమ్మారెడ్డి నాగిరెడ్డి ఆధ్వర్యంలో బహు మతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చందలూరి గిరిజ, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచి, విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సంజీవరెడ్డి, ఉప చైర్మన్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన ఉండాలి

జిల్లా రవాణా శాఖ అధికారి చంద్రశేఖర రెడ్డి

మాట్లాడుతున్న జిల్లా రవాణా శాఖ అధికారి చంద్రశేఖర రెడ్డి

ప్రజాశక్తి- చెరుకుపల్లి

ప్రజలందరూ రహదారి భద్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని బాపట్ల జిల్లా రవాణా శాఖ అధికారి చంద్రశేఖర రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు రహదారి భద్రతపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నింబంధనలను తెలుసుకొని తప్పక పాటించాలని సూచించారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు వినియోగించి వాహనాలు నడిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామనితెలిపారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రంగారావు మాట్లాడుతూ స్కూల్ బస్సుల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిన్నిబోయిన శివనారాయణ, పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి : గాదె

ప్రజాశక్తి-రేపల్లె

తుఫాను కారణంగా కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతినడంతో రైతులకు అపార నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి వారి ఆదుకోవాలని జనసేన పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేపల్లె నియోజకవర్గంలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లో వరి, మినుము, మొక్కజొన్న పంటలు వర్షానికి పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. అధికారులు దెబ్బతిన్న క్షేత్రస్థాయిలో సందర్శించి నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపి రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యదర్శి మత్తి భాస్కరరావు, రేపల్లె టౌన్ అధ్యక్షుడు ఆర్.మహేష్, గోపరాజు ఉదయ్ కష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

రీసర్వే పూర్తి చేయాలి

కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి - చీరాల

భూముల రీసర్వేను పూర్తి చేసేందుకు రెవెన్యూ అధికారులు అందరూ సమిష్టిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. స్థానిక పద్మశాలీయ కళ్యాణ మండపంలో డివిజన్ పరిధిలో ఆర్‌డిఒ, తహశీల్దారు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది తో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూరక్ష పథకం రీసర్వేపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు రెవెన్యూ చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. రీసర్వే ద్వారా భూముల స్వచ్ఛీకరణ చేయాల్సి ఉందన్నారు. ఈ పాటికే సర్వేయర్లు శిక్షణ పొందారని వారు మనసా వాచాతో పనిచేసి తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవాలన్నారు. గ్రామ సభలు నిర్వహించి సర్వే వివరాలు, దాని లాభాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. ప్రజలకు సందేహాలు ఉంటే నివత్తి చేయాలన్నారు. భూ సరిహద్దులను ముందుగా నిర్ధారించాలని ఆదే శించారు. భూ యజమానుల సమక్షంలోనే ఖచ్చితమైన కొలతలతో సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఆర్‌డిఒ సరోజిని, తహశీ ల్దారు ప్రభాకర్ రావు, సంధ్య శ్రీ, మున్సిపల్ కమిషనర్ ఏసయ్య, వివిధశాఖల అధికారులు, సర్వేయర్లు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ బాబూరావు

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి చీరాల

ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల ఆసరాగా ఉన్న మనోవికాస కేంద్రాలకు చేయూత నందించాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బాబూరావు తెలిపారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏరియా వైద్యశాల సమీపంలోని చైతన్య మనోవికాస రిహాబిలిటేషన్ కేంద్రానికి బుధవారం నిత్యవసర సరుకులు అందజేశారు. అమరా వీరాంజనేయులు సహకారంతో 100 కిలోల బియ్యం, అరటిపండ్లు, ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ సుభాషిణి సహకారంతో నూనె డబ్బా, వంట సామగ్రిని అందజేశారు. ఈసందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బాబూరావు మాట్లాడుతూ పిల్లలకు ఉపయోగపడే నిత్యావసరాలను అందిస్తూ, మానసిక దివ్యాంగులకు సేవ చేస్తున్న రిహాబిటేషన్ సెంటర్ డైరెక్టర్ వెంకన్న బాబును అభినందించారు. త్వరలో విద్యార్థులకు వైద్యశిబిరం నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ సిహెచ్.బాలవెంకటేశ్వరరావు, పోలుదాసు రామకష్ణ, దోగుపర్తి వెంకట సురేష్,అమరా వీరాంజనేయులు, వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నాపత్రాలు ఆవిష్కరిస్తున్న డిసిఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ

మోడల్ ప్రశ్నాపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి -నిజాంపట్నం

యుటిఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన పదవ తరగతి మోడల్ ప్రశ్నాపత్రాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని గుంటూరు జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మదన్ తెలిపారు. అడవులదీవి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో పదో తరగతి మోడల్ ప్రశ్నాపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు జె. వినయ్ కుమార్ మాట్లాడుతూ యుటిఎఫ్ రూపొందించిన పదో తరగతి మోడల్ ప్రశ్నాపత్రాల పుస్తకంలో ఆరు మాదిరి ప్రశ్న పత్రాలు ఉన్నట్లు తెలిపారు. యార్లగడ్డ మదన జన్మదిన సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ మోడల్ ప్రశ్నాపత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు మోహన్‌రావు, నిజాంపట్నం మండల అధ్యక్షుడు సిహెచ్.బాపయ్య ప్రధాన కార్యదర్శి గణేష్‌రావు, అధ్యక్షుడు వై. శ్రీనివాసరావు, కోశాధికారి మాలిక్, వైపి. మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

కోటేశ్వరమ్మ చిత్రపటానికి నివాళి

కొండపి : మండల పరిధిలోని కె.ఉప్పలపాడు గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి వాకా పున్నారెడ్డి తల్లికి వాకా కోటేశ్వరమ్మ దశదిన కర్మ బుధవారం నిర్వహించారు. ఈ కార్యరకమంలో పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య పాల్గొని కోటేశ్వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాకా పిచ్చిరెడ్డి, శంకర్‌రెడ్డి, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికైన ఎన్జీవో జిల్లా కమిటీ

ఎన్జీవో జిల్లా కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శరత్, కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కె.శరత్‌బాబు, ఆర్‌సిహెచ్ కృష్ణారెడ్డి మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎన్జీవో భవనంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ప్రకాశం జిల్లా బ్రాంచ్ నామినేషన్ల ప్రక్రియ బుధవారం జరిగింది. ప్రకాశం జిల్లా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తొలుత ఎన్జీవో అసోసియేషన్ జిల్లా కమిటీ పదవులకు నామినేషన్లు వేసిన వారు ఉద్యోగులతో ప్రకాశం భవనం నుంచి ఎన్జీవో భవనం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఉత్సాహభరిత వాతావరణంలో ఉద్యోగుల సమక్షంలో కమిటీ పదవులకు నామినేషన్లు వేశారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా ఎన్జీవో అసోసియేషన్ నెల్లూరు జిల్లా అధ్యక్షులు ఎం పెంచలరావు, సహాయ ఎన్నికల అధికారిగా ఎన్.వెంకట స్వామి వ్యవహరించారు. జిల్లా కమిటీలో మొత్తం 15 పోస్టులకు ఒక్కొక్క నామినేషన్ రావటంతో పోటీ చేసిన వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ఎపి ఎన్జీవో అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షులుగా కె.శరత్ బాబు(వైద్య, ఆరోగ్య శాఖ), కార్యదర్శిగా ఆర్‌సిహెచ్ కృష్ణారెడ్డి(జల వనరుల శాఖ సీనియర్ అసిస్టెంట్) ఏకగ్రీవంగా మూడోసారి ఎన్నికయ్యారు. సహాధ్యక్షులుగా ఎం.వెంకటేశ్వర్‌రావు (పర్యవేక్షకులు, వ్యవసాయ శాఖ) ఉపాధ్యక్షులుగా పి.రోజ్ కుమార్ (పశుసంవర్ధక శాఖ), తోట శ్రీనివాస్ (సీనియర్ అసిస్టెంట్, జలవనురుల శాఖ), పి.రామాంజనేయులు (వైద్య ఆరోగ్య శాఖ ఎంపిహెచ్ఓ) కె.చిరంజీవి(విఆర్ఓ), బి.కృష్ణకిషోర్ (సీనియర్ అసిస్టెంట్, వెలిగొండ ప్రాజెక్ట్ డివిజన్ మార్కాపురం) ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులతో ఎన్నికల అధికారి పెంచలరావు ప్రమాణం చేయించారు.

నష్టపోయిన వారిని

అన్ని విధాలా ఆదుకుంటాం

పరిహారం చెక్కులు అందజేసిన కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాండూస్ తుఫాన్‌తో నష్టపోయిన వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ పునరుద్ఘాటించారు. ఇటీవల వర్షాలతో సిఎస్‌పురం, పామూరు మండలాలలో ఇళ్లు కూలిపోయిన బాధితులకు ప్రభుత్వం తరపున నష్టపరిహార చెక్కులను బుధవారం తన క్యాంపు కార్యాలయంలో అందించారు. సిఎస్‌పురం మండలం కోవిలంపాడు గ్రామానికి చెందిన అంగి రేకుల ప్రమీల ఇల్లు, పామూరు మండలం పడమర కట్టకింద పల్లి గ్రామానికి చెందిన ఆంధ్ర రాజమ్మ ఇల్లు వర్షాలతో కూలిపోయాయి. వీటికి సంబంధించి స్థానిక రెవెన్యూ అధికారుల నుంచి కలెక్టరేట్‌కు నివేదికలు వచ్చాయి. వీటిని పరిశీలించిన కలెక్టర్ ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక్కో కుటుంబానికి రూ.95,100 చొప్పున బ్యాంకు చెక్కులు అందించారు. ఈ సందర్భంగా బాధితులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడి వారి కుటుంబనేపథ్యాన్ని తెలుసుకున్నారు. ప్రభుత్వం తరపున "పేదలందరికీ ఇళ్లు". పథకంలో భాగంగా పక్కా ఇళ్లు మంజూరు చేసి మరో రూ.1.80 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తామని, ఇళ్లు నిర్మించుకోవాలని వారికి సూచించారు. అనంతరం ఛార్జీలు, ఇతర ఖర్చుల కోసం తన సొంత డబ్బులు ఇచ్చి వారిని పంపించారు.

చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సమగ్రాభివృద్ధిపై దృష్టి పెట్టండి: కలెక్టర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మండల సమగ్ర అభివద్ధే ధ్యేయంగా ప్రణాళిక రూపకల్పనపై దష్టి పెట్టాలని కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ సూచించారు. ప్రజా ప్రణాళికా ఉద్యమంలో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి గ్రామ, బ్లాక్, జిల్లా స్థాయి పంచాయతీరాజ్ సంస్థల ప్రణాళికల తయారీ కార్యక్రమం పై ఎంపిపిలు, జడ్‌పిటిసిలు, ఎంపిడిఒలకు బుధవారం స్థానిక పాత జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక అవకాశాలను గుర్తించి మండల సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాలన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రకాశం జిల్లాను అభివద్ధి చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జడ్పీ సిఇఒ బి.జాలిరెడ్డి, డిపిఒ నారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజావైద్యులు టాన్యాకు ఘన నివాళి

ఉచిత వైద్యశిబిరం విజయవంతం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజావైద్యులు డాక్టర్ మోటూరు టాన్యాకు కుటుంబసభ్యులు ఘన నివాళులు అర్పించారు. ప్రజా వైద్యులు డాక్టర్ మోటూరు టాన్యా 81వ జయంతి సందర్భంగా బెతూన్ నర్సింగ్ హోమ్‌లో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. తొలుత డాక్టర్ టాన్యా చిత్రపటానికి డాక్టర్ యన్.రంగారావు పూలమాల వేసి.. నివాళులర్పించారు. ఈ సందర్భంగా బెతూన్ నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ ఎన్.ఉదయిని మాట్లాడుతూ సమాజంలో మహిళలు తన ఆరోగ్యాన్ని లెక్క చేయక కుటుంబం కోసం తన సర్వశక్తులను ధారపోస్తారన్నారు. కుటుంబంలోని మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబ సభ్యులను బాగా చూసుకోగలరని, మహిళలు ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. స్త్రీ సంబంధిత క్యాన్సర్ల పట్ల ఒక అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమాన్ని గత పది సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామన్నారు. మహిళలలో వస్తున్న బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్లను ముందుగా గుర్తించడం కోసం కొన్ని స్క్రీనింగ్ టెస్ట్‌ను ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌సిజి. ఎంఎన్ఆర్. క్యాన్సర్ సెంటర్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ ఎన్.రమణారెడ్డి క్యాన్సర్‌పై అవగాహన కోసం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ డాక్టర్ మోటూరి టాన్యా ప్రజావైద్యులుగా వైద్యసేవలు అందిస్తూ, మహిళా సమస్యలపై మహిళా సంఘంలో అనేక పోరాటాలలో పాల్గొన్నారన్నారు. మహిళా ఉద్యమ నిర్మాత మోటూరు ఉదయం పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి.. మహిళలకు ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేశారన్నారు. ఉచిత వైద్యశిబిరంలో 70 మంది స్క్రీనింగ్ టెస్ట్‌లు చేయించుకున్నారు. కార్యక్రమంలో బెతూన్ నర్సింగ్ హోమ్ వైద్యులు టి.పురుషోత్తమ రావు, డాక్టర్ టి.స్వాతి, డాక్టర్ కష్ణకుమారి, డాక్టర్ కళ్యాణి ప్రసంగించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎస్‌డి షమ్మి, జిల్లా నాయకులు కె.సజన, ఎస్‌కె నాగూర్ బి, జి.ఆదిలక్ష్మి, కె.రాజేశ్వరి, యు.రాజ్యలక్ష్మి, జి.కళ్యాణి, భావన రాజలక్ష్మి, సిహెచ్ రమాదేవి, బి.పెద్ద గోవిందమ్మ, పి.ప్రేమలత పాల్గొన్నారు.

టాన్యా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ రంగారావు, మాట్లాడుతున్న డాక్టర్ ఉదయిని

రైతులను ఉదారంగా ఆదుకోవాలి: దామచర్ల

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాండూస్ తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలతో పంటలు తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌ను టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దనరావు కోరారు. ఈ విషయమై బుధవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా దామచర్ల మాట్లాడుతూ సాగు రైతులతోపాటు కౌలు రైతులు కూడా పూర్తి న్యాయం చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, కసుకుర్తి అంకరాజు, పి.వెంకటేశ్వర రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ మహిళాధ్యక్షురాలు రావుల పద్మజ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న దామచర్ల

మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్

శ్రీనివాసులరెడ్డి మృతి

పలువురు రాజకీయ నేతల నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఒంగోలు పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దేవిరెడ్డి శ్రీనివాసులరెడ్డి(72) బుధవారం తెల్లవారుజామున హఠాన్మరణం చెందారు. మంగమూరురోడ్డులోని ఆయన నివాసగృహంలో మృతదేహాన్ని పలువురు ప్రముఖులు, న్యాయవాదులు సందర్శించి ఆయనకు నివాళులర్పించారు. మచిలీపట్నంలో పోస్టు గ్రాడ్యుయేట్ పూర్తిచేసిన ఆయన ఆంధ్రా యూనివర్సిటీలో న్యాయవిద్యను అభ్యసించారు. 1978లో ఒంగోలులో న్యాయవాదిగా వృత్తిని ప్రారంభించారు. కొంతకాలం సీనియర్ న్యాయవాది తోట రామ్మూర్తి కార్యాలయంలో పనిచేశారు. తర్వాత ఆయన సొంతంగానే ప్రాక్టీసు ప్రారంభించారు. అనేక కేసుల్లో శక్తివంచన లేకుండా వాదించారు. మంచి లాయర్‌గా గుర్తింపు పొందారు. రాజకీయనేతలకు, పార్టీలకు ఆయనే కీలకంగా పనిచేశారు. న్యాయపరమైన అంశాల్లో జిల్లా నేతలు కూడా ఆయన నుంచే సలహాలు తీసుకున్నారు. 1989 నుంచి 2002 వరకూ జిల్లా కోర్టుకు పబ్లిక్‌ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. తర్వాత సీనియర్ న్యాయవాదిగా చివరి వరకూ కొనసాగారు. ఆయనకు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు కరణం బలరాం, గొట్టిపాటి రవికుమార్, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, వైసిపి జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, పిడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ మేదరమెట్ల శంకరారెడ్డి, పలువురు నేతలు, లాయర్లు నివాళులర్పించారు.

శ్రీనివాసులరెడ్డి

ఒంగోలులోని సుందరయ్య భవన్‌లో కమ్యూనిస్టు యోధులు మాకినేని బసవపున్నయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

\- ప్రజాశక్తి, ఒంగోలు కలెక్టరేట్